RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 288 మేడ్చల్ మల్కాజ్‌గిరి 9 నవంబర్ 2024 శనివారం పేజీలు : 4

## వరద సాయం పెట్టని కేంద్రం...మమత ఫైర్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌ను వరదలు ముంచెత్తుతుండటంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. వరద సాయం అందించడంలో కేంద్రం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోందంటూ తప్పుపట్టారు. తీవ్ర వరద ప్రభావాన్ని ఎదుర్కొంటున్న ఉత్తర బెంగాల్‌లో పర్యటించేందుకు బయలు దేరుతూ మీడియాతో మమతా బెనర్జీ మాట్లాడారు. "కేంద్రం చేసిందేమీ లేదు, ఉత్తర బెంగాల్ మొత్తం జలదిగ్బంధంలో ఉంది. పరిస్థితిని స్వయంగా తెలుసుకునేందుకు అక్కడకు వెళున్నాను. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ చాలా పెద్ద పెద్ద హామీలే ఇస్తారు, ఆ తర్వాత కనిపించరు. " అంటూ కేంద్రంపై సీఎం మండిపడ్డారు. నేపాల్ నుంచి విడుదలైన 5 లక్షల క్యూసెక్కుల కోసీ నదీ జలాలతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు జలవిలయంలో చిక్కుకున్నాయని ఆరోపించారు.



# జమిలివైపు... వడివడిగా అడుగులు!

## సాధ్యాసాధ్యాలపై మోడీ టీం కసరత్తు!

## పార్లమెంటులో 3 బిల్లులు పెట్టనున్న కేంద్రం వీటిలో రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు

న్యూఢిల్లీ : లోక్‌సభలో బీజేపీకి సొంతంగా మెజారిటీ లేకపోయినా.. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'పై మోదీ ప్రభుత్వం ఏ మాత్రం వెనక్కి తగ్గడంలేదు. జమిలి ఎన్నికలను సాకారం చేసేందుకు పార్లమెంటులో మూడు బిల్లులను ప్రవేశపెట్టాలని సంకల్పించింది. వీటిలో రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని అత్యున్నత స్థాయి కమిటీ చేసిన సిఫారసులను కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదించిన సంగ తి తెలిసిందే. ప్రతిపాదిత మొదటి రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం.. 'అపాయింటెండ్ డే (ప్రభుత్వం ప్రా రంభమయ్యే రోజు)'కు సంబంధించి 82ఏ అధికరణలో కొత్తగా సబ్‌క్లాజ్ (1) చేరుస్తారు. లోక్‌సభ, అన్ని రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీల పదవీకాలాన్ని ఒకేసారి ముగించేందుకు 82ఏలోనే సబ్‌క్లాజు (2) జోడిస్తారు. ఇక లోక్‌సభ పదవీకాలం, రద్దుకు సంబంధించి 83(2) అధికరణను సవరించి కొత్తగా సబ్‌క్లాజ్ (3), (4)లను చేరుస్తారు. రాష్ట్రాల అసెంబ్లీల రద్దు నిబంధనలూ ఇందులో ఉంటాయి. 327అధికరణను సవరించి 'సమాంతర ఎన్నికలు' అనే పదబం?ధాన్ని జోడిస్తారు. ఈ బిల్లుకు కనీసం సగం రాష్ట్రాలు ఆమోదించాల్సిన అవసరం లేదని కోవింద్ కమిటీ సిఫారసు చేసింది. దీనిని క్యాబినెట్ ఆమోదించింది. ఇక రెండో రాజ్యాంగ సవరణకు మా త్రం కనీసం సగం రాష్ట్రాల అంగీకారం తప్పనిసరి. ఎందుకంటే ఇది స్థానిక ఎన్నికలకు సంబంధించింది. పూర్తిగా రాష్ట్ర జాబితాలోని అంశం. లోక్‌సభ/అసెంబ్లీ ఎన్నికలతో పాటు సమాంతరంగా పంచాయతీరాజ్/పురపాలక, నగరపాలక సంస్థలకూ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల(ఎసఈసీ)తో కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) సంప్రదింపులు జరి పి అన్ని ఎన్నికలకూ ఒకే ఓటర్ల జాబితా రూపొందించడానికి ఉద్దేశించిన బిల్లు ఇది. దీనిప్రకారం 324ఏ అధికరణను కొత్తగా చేరుస్తారు. రాజ్యాంగం ప్రకారం ఈసీ, ఎస్ఈసీ వేర్వేరు వ్యవస్థలు. ఈసీ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ, రాజ్యసభ, అసెంబ్లీ, శాసనమండలి ఎన్నికలు నిర్వహిస్తుంది. ఎస్ఈసీ పంచాయతీలు, మునిసిపాలిటీల ఎన్నికల నిర్వహణ బాధ్య త చూస్తున్న సంగతి తెలిసిందే. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల నియమ నిబంధనలు కేంద్ర పాలిత ప్రాం తాలైన పుదుచ్చేరి, ఢిల్లీ, జమ్మూకశ్మీరు అసెంబ్లీలకు కూడా వర్తించేలా మూడు చట్టాలు.. ఢిల్లీ దేశరాజధాని ప్రాంత ప్రభుత్వ చట్టం (1991), కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ చట్టం (1963), జమ్మూకశ్మీరు పునర్వ్యవస్థీకరణ (2019) చట్టాలను సవరించాలని మూడో బిల్లులో ప్రతిపాదించనున్నారు. వీటికి సంబంధించిన అధికరణల్లో 12 కొత్త సబ్‌క్లాజులను చేరుస్తారు. రెండు దశల్లో జమిలి ఎన్నికలను నిర్వహించాలని కోవింద్ కమిటీ సూచించింది. మొదటి దశలో లోక్‌సభ, అన్ని రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు జరపాలని పేర్కొంది. ఇవి జరిగిన వంద రోజుల్లోపు రెండో దశలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని సిఫారసు చేసింది.

## అస్త్ర, శస్త్రాలు సిద్ధం చేస్తోన్న కేసీఆర్. బరిలోకి అప్పుడేనట.. పక్కా ప్లాన్ ఇదీ

పదేళ్ల తర్వాత అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ప్రజాక్షేత్రంలోకి రావడానికి అస్త్ర,శస్త్రాలు సమకూర్చుకుంటున్నారు. అధికార కాంగ్రెస్ పై ప్రజల్లో మొదలైన వ్యతిరేకతని తమవైపు తిప్పుకునే ప్రణాళికలు రచిస్తున్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలంగా తీర్చిదిద్దే చర్యలు చేపడుతున్నారు. స్థానిక సమరం ముగిసేంతవరకు తాను ఓపిక పట్టాలని, ఈలోగా క్యాడర్ తో విస్తృతంగా అనుసంధానం అవుతూ, పార్టీకి జనంలో సానుకూలత వచ్చేలా చూసుకోవాలని నిర్ణయించారు. వచ్చే ఏడాది నుంచి తాను సైతం స్వయంగా రంగంలోకి దిగి అధికార పార్టీని ఉక్కిరిబిక్కిరి చేసేలా బీఆర్ఎస్ ని నడిపిద్దామని పార్టీ క్యాడర్ కి కేసీఆర్ సంకేతాలిస్తున్నారు.

**ఫార్మ్ హౌస్ లో క్యాడర్ తో క్షేత్రస్థాయి పరిస్థితులపై లోతుగా ఆరా:** అధికారం కోల్పోయాక, లోకసభ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత పూర్తిగా ఫార్మ్ హౌస్ కె పరిమితమైన కేసీఆర్ అక్కడేమీ విశ్రాంతి తీసుకొని, కాలక్షేపం చేయడం లేదు. తమ పార్టీ నేతలకి అక్కడి నుంచే డైరెక్షన్లు ఇస్తున్నారు. అంతే కాక పార్టీ సానుభూతిపరులైన అధికారులు, మేధావులతో రాష్ట్రంలో పాలన ఎలా సాగుతుంది..? కాంగ్రెస్ పరిస్థితి, నేతల తీరుపై ఆరా తీస్తున్నారు. అంతే కాకుండా గతానికి భిన్నంగా తనని కలవాలని వస్తోన్న గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలతోనూ మాట్లాడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో మూలమూలలో ఏమి జరుగుతోంది..? జనం ఏమి కోరుకుంటున్నారో వారి నుంచి తెలుసుకుంటున్నారు. ఈ ఫీడ్ బ్యాక్ ఆధారంగానే భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని మాజీ సీఎం భావిస్తున్నట్లు తెలుస్తోంది. తాను ఎవరెవరిని కలిస్తుందీ, ఎవరెవరినుంచి సమాచారం సేకరిస్తోంది అనే విషయాలు బయటకి రాకుండా కట్టడి చేశారు.

**స్థానిక సమరం ముగిశాక ఇక తానే నేరుగా రంగంలోకి వస్తానని సంకేతాలిస్తోన్న మాజీ సీఎం కేసీఆర్:** కాంగ్రెస్ ప్రభుత్వం, సీయం రేవంత్ రెడ్డిపై జనంలో ఇప్పుడిప్పుడే అసంతృప్తి మొదలైందని, ఇది ఇంకా పెరిగేదాకా తాము వేచి ఉండాలని మాజీ సీఎం కేసీఆర్ భావనగా కనిపిస్తోంది. ఆరు గ్యారంటీల అమలులో చతికిలబడడం, రుణమాఫీ పూర్తిగా అమలవకపోవడం, హైడ్రా, మూసీ ఆక్రమణల కూల్చివేతల లాంటి దుందుడుకు చర్యలతో కాంగ్రెస్ పై జనం లో చర్చ మొదలైందని, ఇది రాబోయే మూడు, నాలుగు నెలల్లో మరింతగా పెరగడం ఖాయంగా బీఆర్ఎస్ అధినేత అంచనా వేస్తున్నారు. ఈలోగా స్థానిక ఎన్నికలూ పూర్తవుతాయని, తమ పార్టీని కూడా ఈ గడువులోగా దుర్భేద్యశక్తిగా క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మిస్తామని కెసిఆర్ సంకేతాలిస్తున్నారు. ఈ నాలుగు నెలల్లో అన్ని అస్త్ర,శస్త్రాలని సమకూర్చుకొని



అపై తాను స్వయంగా రంగంలోకి రావాలని కేసీఆర్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఈసారి కేసీఆర్ రంగంలో దిగితే భూకంపమే:** సకల అస్త్ర,శస్త్రాలు, పూర్తి క్యాడర్ సన్నద్ధత తో మాజీ సీఎం కేసీఆర్ ప్రజల్లోకి రావాలని నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ వైఫల్యాలతో పాటు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం, తమ పదేళ్ల పాలనలో చేసిన పనులని ఆయుధాలుగా జనంలోకి తీసుకెళ్లి జనాన్ని మళ్ళీ తమవైపు తిప్పుకుంటామనే ధీమా తో కేసీఆర్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సారి తను రంగంలోకి వచ్చాక కాంగ్రెస్, బీజేపీలకు వణుకు తప్పదని, రాజకీయ భూకంపం సృష్టిస్తాననే సంకేతాన్ని కెసిఆర్ క్యాడర్ కి పంపుతుండడం రాజకీయవర్గాల్లో చర్చకు దారితీసింది.



## మూసీ ప్రక్షాళనకు దుర్మార్గులు అడ్డొస్తున్నారు

హైదరాబాద్: మూసీ ప్రక్షాళనకు కొంతమంది దుర్మార్గులు అడ్డొస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. అడ్డుపడే వారిలో భారాస ముందుందని అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని ఉత్పత్తులను ఎవరూ కొనట్లేదని, ఈ ప్రాంతంలో కల్లు అమ్ముకునే పరిస్థితి కూడా లేదన్నారు. యాదాద్రి జిల్లా వలిగొండ మండలం సంగెం నుంచి మూసీ పునరుజ్జీవ యాత్రకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. సంగెం నుంచి నాగిరెడ్డి పల్లె వరకు ధర్మారెడ్డి కాల్వ వెంబడి సుమారు 2.5కి.మీ మేర పాదయాత్ర చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో సీఎం మాట్లాడారు. "మూసీ నదిలో చేపలు బతుకుతున్నాయా? ఈ నది ఒడ్డున పెంచిన గొర్రెలను ఎవరూ కొనడం లేదు. మూసీ నది కలుషితం కావడంతో వ్యవసాయం చేయడం లేదు. మూసీ కాలుష్యం కారణంగా పట్టణాలు, గ్రామాలు నాశనం అవుతున్నాయి. కాళేశ్వరం పేరుతో భారాస నేతలు రూ.లక్ష కోట్లు దోచుకున్నారు. భారాస నేతల మాదిరిగా గారడీ చేయడం మాకు రాదు. మూసీ ప్రక్షాళన, బుల్డోజర్‌కు ఎవరు అడ్డొచ్చినా లెక్కచేయం. ఈ ప్రాజెక్టును చేపట్టాలని నిశ్చయించుకున్నాం. మరో 30 రోజుల్లో తుదిరూపం తీసుకొస్తాం" అని సీఎం తెలిపారు. జనవరి తొలివారంలో వాడపల్లి నుంచి పాదయాత్ర ప్రారంభిస్తానని రేవంత్ ప్రకటించారు. మూసీ పునరుజ్జీవ సంకల్పయాత్రలో భారీగా కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నాయి. సంగెం గ్రామస్థులు పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. మూసీ వల్ల కలిగే సమస్యలను సీఎంకు వివరించారు.




# నిరుపేదలకు శుభవార్త... ఇందిరమ్మ ఇండ్ల డిజైన్ రెడీ!

హైదరాబాద్ : ఈ నెలాఖరులోపే ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్ ను ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇండ్లను అందజేస్తామని వెల్లడించారు. దీంతో అధికారులు ఇండ్లకు సంబంధించి డిజైన్ పై కసరత్తు స్పీడప్ చేశారు. వరుస సమావేశాలు నిర్వహించి.. ఇప్పటికే నాలుగైదు రకాల డిజైన్లు రెడీ చేసినట్టు తెలిసింది.

సదరు డిజైనర్లపై హౌజింగ్ శాఖ మంత్రి సమీక్షించి, ముఖ్యమంత్రికి నివేదించి.. అప్రూవల్ పొందిన తర్వాతే ఫైనల్ చేయనున్నట్లు తెలిసింది. ఈఅంశంపై త్వరలోనే హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి సమీక్షించనున్నట్లు సమాచారం.

**పాత డిజైన్లకు సమీపంలో..** ఇందిరమ్మ ఇండ్ల పాత డిజైన్లకు సమీపంలోనే కొత్త డిజైన్ ఉంటుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఇంటి నిర్మాణంలో 'కాంగ్రెస్ రికగ్నైజేషన్' కనిపించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. డిజైన్లు రూపొందించే ముందు ఈ అంశాన్ని గమనంలోకి తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఉన్నతాధికారులకు ఆదేశాలు అందినట్టు సమాచారం.

అయితే పాత డిజైన్ నుంచి లోగో, కలర్లను స్వీకరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు కేంద్రం సహకారంతో ఇండ్లు నిర్మిస్తే తాము రూపొందించిన లోగోను ఇండ్లపై తప్పనిసరిగా ఉండాలని కేంద్రం షరతు విధించింది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్ కోసం ప్రభుత్వం లోగోను ప్రభుత్వం తయారు చేయిస్తున్నది. పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఇంటి ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఉండే గోడలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లోగోలను ముద్రించాలా అన్న దానిపై అధికారులు చర్చిస్తున్నారు.

**ఇతర రాష్ట్రాల స్కీమ్స్‌పై స్టడీ!..** వివిధ రాష్ట్రాలు అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలపై అధికారులు స్టడీ చేస్తున్నట్టు తెలిసింది. అక్కడికి నేరుగా వెళ్లకుండా ప్రాథమికంగా ఇక్కడి నుంచే అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ విషయమై అధికారులకు హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

పథకం అమలులో ఆయా రాష్ట్రాల అనుభవాలను పరిగణనలోకి తీసుకోవటం ద్వారా తెలంగాణలో పథకాన్ని పకడ్బందీగా అమలు అవకాశముంటుందని తెలిపారు. అయితే, ఇతర రాష్ట్రాల్లో అధికారులు ఎప్పుడు పర్యటిస్తారన్న దానిపై క్లారిటీ లేదు.

**నిధుల సమీకరణ సవాలే...** ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్ కింద ఒక్కో ఇంటికి దశలవారీగా రూ. 5లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని ప్రభుత్వం ఇదివరకే స్పష్టం చేసింది. అయితే, ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజాపాలనలో 80 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. అందులో నుంచి అనర్హులను తొలగించి, అర్హులతో జాబితా తయారుచేసిన తరువాత ప్రభుత్వం రూపొందించే మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక చేపట్టనున్నట్టు సమాచారం. అందుకు కావాల్సిన నిధుల సమీకరణ కూడా ప్రభుత్వ ఒక సవాలే కానుంది. మరోవైపు, 4.5 లక్షల మందికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేసేందుకు రూ. 22,500 కోట్లు అవసరం కానున్నాయి.

అయితే, ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ. 7,740 కోట్లు మాత్రమే కేటాయించారు. రిలైజ్డ్ ఎస్టిమేషన్స్ లో పెంచుతారా లేదా అన్న దానిపై సందిగ్ధత నెలకొన్నది. ఇక హౌజింగ్ శాఖ హడ్కో నుంచి రూ. మూడు వేల కోట్లు సేకరించాలని ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. కేంద్రం నుంచి ఒక్కో ఇంటికి రూ. 1.5 లక్షల చొప్పున నిధులు అందే అవకాశముంది.
అయినప్పటికీ మరో రూ. 5,000 కోట్ల వరకూ లోటు ఏర్పడనుంది. దీనిపై ఎలా ముందుకు వెళతుందన్నది తేలాల్సి ఉన్నది.

గరుడ వార్త



# సంపాదకీయం

## అక్కడ భారతీయ విద్యార్థులకు డేంజర్ బెల్స్!

భారతీయులు గత కొన్నేళ్లుగా కెనడాకు ఎక్కువగా వెళ్తున్నారు. ముఖ్యంగా అమెరికాకు వెళ్లాలనుకునేవారికి త్వరగా వీసాలు లభించకపోవడంతో ప్రత్యామ్నాయంగా కెనడాను ఎంచుకుంటున్నారు. అమెరికా, కెనడా రెండూ సరిహద్దు దేశాలు. అంతేకాకుండా ప్రపంచంలోనే వైశాల్యంపరంగా రెండో పెద్ద దేశం కెనడా. అక్కడ వివిధ రంగాల్లో మానవ వనరుల కొరత విపరీతంగా ఉంది. కావాల్సినంత భూమి ఉన్నా అందుకు తగ్గ జనాభా లేరు. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా పెద్ద సంఖ్యలో వలసలను ఆ దేశం ఆహ్వానించింది. కెనడా ఆహ్వానాన్ని అప్పట్లో అందరిలాగే భారతీయులు అందిపుచ్చుకున్నారు. భారీగా కెనడాకు వెళ్లారు. ముఖ్యంగా ఉన్నత విద్య కోసం ఆ దేశానికి వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రపంచంలోనే టాప్ 200 విశ్వవిద్యాలయాల్లో కొన్ని కెనడాలో కూడా ఉన్నాయి. ఇంగ్లిష్ స్పీకింగ్ కంట్రీ కావడం, అమెరికా పక్కనే ఉండటం వంటి కారణాలతో ఇతర దేశాలతో పోలిస్తే కెనడాకు వెళ్లే భారతీయుల సంఖ్య భారీగా పెరిగింది. అందులోనూ అమెరికా వీసా దక్కనివారు ముందు కెనడాకు వెళ్తే అక్కడి నుంచి అమెరికా వెళ్లడం సులువుతుందని కెనడాను ఎంచుకుంటున్నారు. అయితే ఈ వలసలు ఇటీవల కాలంలో ఎక్కువ కావడం, కొన్ని చోట్ల కెనడియన్ల కంటే ఎక్కువ సంఖ్యలో విదేశీయులు ఉండటం వంటివి తలెత్తాయి. ముఖ్యంగా వలసలు ఎక్కువ కావడంతో గృహాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో ఇళ్ల ఖర్చు భారీగా పెరిగిపోయింది. దీంతో స్థానిక కెనడియన్లు భగ్గుమన్నారు. వలసల వల్ల కెనడియన్లు వెనుకబడిపోతున్నారని, ఉద్యోగాల్లోనూ వలస వచ్చినవారికే ప్రాధాన్యత లభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇళ్ల కోసం గతంతో పోలిస్తే భారీగా వెచ్చించాల్సి వస్తోందని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో ఇటీవల కెనడా వలసలపై ఆంక్షలు విధించింది. విదేశీ విద్య కోసం విద్యార్థులకు వీసా ఫీజులను పెంచింది. అంతేకాకుండా వారి బ్యాంకు ఖాతాల్లో కనీసం ఉండాల్సిన ఆర్థిక నిల్వలను కూడా భారీగా పెంచింది. అలాగే వలసలను తగ్గించడమే లక్ష్యంగా కొత్త ఇమ్మిగ్రేషన్ పాలసీని తీసుకొచ్చింది. దీంతో కెనడాలో ఉంటున్న వివిధ దేశాల ప్రజలకు, విద్యార్థులకు కొత్త కష్టం వచ్చిపడింది. ముఖ్యంగా కెనడాలో ఉంటున్న విదేశీయుల్లో అత్యధికం భారతీయులే. అలాగే అక్కడ విద్యనభ్యసిస్తున్న వారిలో భారత విద్యార్థులే ఎక్కువ మంది ఉన్నారు. వీరంతా ఇప్పుడు ఆ దేశాన్ని వీడాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. శాశ్వత పౌరసత్వం లభించని వారు, విద్య, ఉద్యోగాల కోసం వచ్చి తమ వీసా గడువు ముగిసినవారు కెనడాను విడిచిపెట్టాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో భారతీయ విద్యార్థులు నిరసనకు దిగారు. కెనడా కొత్త ఇమ్మిగ్రేషన్ పాలసీ తమ అవకాశాలను దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం.. భారతీయ విద్యార్థులు వర్క్ పర్మిట్ పొందడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. అంతేకాకుండా శాశ్వత నివాసం పొందడానికి మరింత కష్టపడాల్సి వస్తోంది. కెనడా భారీగా వచ్చిన వలసలతో ప్రస్తుతం అధిక జనాభా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వలసల వల్లే ఈ పరిస్థితి సంభవించిందని ఆ దేశ గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ వలసలు ఆరోగ్య రంగం, గృహనిర్మాణం వంటి ప్రభుత్వ రంగాలను దెబ్బతీసింది. దీంతో ఇమ్మిగ్రేషన్ విధానంలో మార్పులు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. అయితే.. చాలా మంది విద్యార్థులు విదేశాలకు వెళ్లి అక్కడ ఉద్యోగం సంపాదించడానికి, చదువుకోవడానికి రుణాలు తీసుకుంటారు. అందువల్ల, వారు గ్రాడ్యుయేషన్ అయిన వెంటనే తిరిగి భారతదేశానికి వెళ్లిపోవాల్సి వస్తే వారి నెత్తిన భారీగా అప్పుల భారం పడుతుంది. అందుకే ఇప్పటికే కెనడాలో చదువుతున్న వారికి కొత్త ఇమ్మిగ్రేషన్ విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని భారతీయ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే శాశ్వత పౌరసత్వం పొందడానికి ప్రభుత్వం అవకాశాలు కల్పించాలని, ఇతర ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

## ఉమ్మడి మండలంలో ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు





శామీర్ పేట, (గరుడ వార్త) : సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం ఉమ్మడి శామీర్ పేట మండలంలోని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేకులు కట్ చేశారు. ఈ జన్మ దిన వేడుకలలో నాయకులు కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వేడుకలను నిర్వహించారు. తూముకుంట మున్సిపాలిటీ, శామీర్ పేట మండలం, మూడు చింతలపల్లి మండలం లోని అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నగరంలో కీలకం.. ప్రయాణ నరకం



కరీంనగర్ : నగరంలో నిత్యం రద్దీగా ఉండే అనుసంధాన రహదారి అది. ఈ మార్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రారంభించిన పనులు అర్ధంతరంగా వదిలేయడంతో రాకపోకలకు అవస్థలు ఎదురవుతున్నాయి. కోతిరాంపూర్ నుంచి కట్టరాంపూర్ వెళ్లే అంతర్గత రహదారిపై ప్రయాణించాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది.

నగరపాలక సంస్థ పరిధిలో రహదారులు, మురుగుకాలువలు, తాగునీటి పైపులైన్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి హామీ నిధులు(సీఎంఏ) రూ. 132.94 కోట్లు కేటాయించారు. గతేడాది అక్టోబరులో నగరవ్యాప్తంగా పనులు ప్రారంభించారు. ఇందులో కొన్ని డివిజన్‌లలో పూర్తి చేయగా, చాలా ప్రాంతాల్లో అసంపూర్తిగా వదిలేశారు. కట్టరాంపూర్ నుంచి కోతిరాంపూర్ వరకు అనుసంధాన రహదారి రెండు కిలోమీటర్లుండగా సగం మేర నిర్మించి వదిలేశారు.

గుంతలతో నరకయాతన

కోతిరాంపూర్ నుంచి కట్టరాంపూర్, భగత్‌నగర్, దోబీవాడ, గణేశ్‌నగర్, తిరుమల్‌నగర్, హనుమాన్‌నగర్, కలెక్టరేట్, ముకరంపుర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇది దగ్గరి దారి. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా గమ్యం చేరుకోవచ్చు. ఈ మార్గంలో రహదారి నిర్మాణానికి గతంలో ఉన్న సీసీని తవ్వారు. పనులు చేయకపోవడంతో గుంతలు పడ్డాయి. పైపులైన్లు పగిలి తాగునీరు లీకవుతోంది. వర్షం పడితే రోడ్డంతా బురదమయంగా మారుతోంది. రహదారి దుస్థితిపై ఇటీవల వినాయకచవితి సందర్భంగా స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. కొందరు మొరం, కంకరపొడి తీసుకొచ్చి పోసుకున్నారు.

వినతుల వెల్లువ

కట్టరాంపూర్-కోతిరాంపూర్ రహదారి అధ్వానంగా మారడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రహదారి పనులు పూర్తి చేయాలని కోరుతూ స్థానికులతో పాటు కార్పొరేటర్ ఆకుల నర్మద, నర్సయ్య పలుమార్లు మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి, కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఫలితం లేకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు

కట్టరాంపూర్ వైపు రహదారి నిర్మాణానికి ఏడాది కిందట తవ్వారు. బాగున్న రోడ్డును చెడగొట్టారు. పెద్ద, పెద్ద గుంతలతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఈ సమస్యపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తాం. చంద్రశేఖర్, కాలనీవాసి

వాహనాలు దిగబడుతున్నాయికోతిరాంపూర్-కట్టరాంపూర్ రహదారిని మరమ్మతులు చేయకుండా వదిలేశారు. ఊరంతా చేసి ఇక్కడ మాత్రం పట్టించుకోవడం లేదు. వర్షం పడితే గుంతలు ఏర్పడుతున్నాయి. అందులో వాహనాలు దిగబడుతున్నాయి. పైపులైన్లు లీకవుతున్నా పరిష్కరించడం లేదు. రాజ్‌కుమార్, స్థానికుడు

## నిర్లక్ష్యం పెరిగి.. భూగర్భ జలం తరిగి..



స్థలాలన్నీ మాయమవుతుండటంతో వర్షం నీరు భూమిలోకి ఇంకడం లేదు. పైగా నీటి సంరక్షణపై ఎవరూ దృష్టి సారించడం లేదు. ప్రతి ఇంటిలో బోరు తవ్వుకోవడం, నీటిని వినియోగించుకోవడం ఎక్కువ అవుతోంది. వృథా నీరంతా కాలువల గుండా వెళ్లి పోతుండటంతో భూగర్భ జలాలు ఏటా తగ్గుతున్నాయి. ఇళ్లలో ఇంకుడుగుంతలు నిర్మించాలన్న ఆదేశాలున్నా ఎవరూ పాటించడం లేదు. తాజాగా పురపాలక శాఖ 300 చ.మీ.ల విస్తీర్ణంలో ఉన్న ప్రతి ఇంటిలో ఇంకుడుగుంత నిర్మించాలని ఆదేశించింది. ఈసారైనా ఆదేశాలు అమలవుతాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గతేడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురియకపోవడంతో ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే తాగు, సాగునీటికి ఇబ్బందులు పడ్డారు. వర్షాలు సైతం ఆలస్యంగా కురియడంతో కాస్త నీటి నిల్వలు పెరిగినప్పటికి.. భూగర్భ జలాలు పెంచుకోవాలనే ఆవశ్యకతను గుర్తించడం లేదు. కరీంనగర్, రామగుండం నగరాలతో పాటు మున్సిపాలిటీల్లో కచ్చితంగా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని పేర్కొంటున్నా పట్టించుకోవడం లేదు. కొత్తగా ఇళ్లను నిర్మించుకునే వారు సైతం ఆ వైపే దృష్టిసారించడం లేదు.

...ప్రాంతాల్లో ఇళ్ల సంఖ్య పెరుగుతోంది. ఖాళీ ఇంటి నిర్మాణ సమయంలో అనుమతులు తీసుకునే సమయంలో పట్టణ ప్రణాళిక విభాగంలో కొంత మొత్తాన్ని ఇంటి యజమానులు ఫీజు చెల్లిస్తున్నారు. చదరపు మీటర్ చొప్పున సుమారు రూ.2 వేల వరకు డిపాజిట్ చేస్తున్నారు. ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత ఇంకుడుగుంత నిర్మిస్తే ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. ఎక్కడా ఆ నిబంధనలు అమలు కావడం లేదు. అనుమతులు ఇచ్చిన అధికారులు దానిని నిర్మించారా? లేదా? అనేది మాత్రం పరిశీలించడం లేదు. పైగా రూ.లక్షల్లో జమ అయిన ఆ మొత్తాన్ని ఇతర అవసరాలకు ఇన్నాళ్లు వినియోగిస్తున్నారు.

300ల చదరపు మీటర్లకు తప్పనిసరి

మున్సిపాలిటీలు, నగరాల్లో 300 చదరపు మీటర్లకు మించిన అన్ని నిర్మాణాల్లో ఇంకుడుగుంత తప్పనిసరి చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ఇప్పటికే ఉన్న భవనాల్లో ఏడాదిలో నిర్మించుకోవాలి.

ఆక్యుపెన్సీ కం కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చేటప్పుడు ఇంకుడుగుంత నిర్మించారా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.

వీటిని నిర్మించుకునేలా ప్రజల్లో చైతన్యం తెచ్చే బాధ్యత కూడా మున్సిపల్ కమిషనర్లదేనని ఉత్తర్వులో వివరించారు.

కరీంనగర్ నగర పరిధిలో 300 చదరపు మీటర్లు ఉన్న భవనాలు 791 ఉన్నట్లుగా ఇటీవల నిర్వహించిన సర్వేలో గుర్తించారు.

ఇప్పటికే 458 బహుళ అంతస్తులో నిర్మించుకున్నారు.

మిగతా333 భవన యజమానులకు నోటీసులు ఇచ్చారు. అందులో 24 భవనాల్లో కొత్తగా నిర్మించుకున్నారు.

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో ప్రభుత్వ కార్యాలయాల్లో ఆధునాతన సాంకేతికను జోడించి ఇంకుడుగుంతలు నిర్మిస్తున్నారు.

నగర, పురపాలికలు 16
ట్యాంకు ఏరియాలు 1,634
మొత్తం ఇళ్లు 3,56,580
ఇంకుడు గుంతల లక్ష్యం : 32,835
నివాసిత గృహాలు 16,630
ప్రభుత్వ భవనాలు 14,571

## రాష్ట్ర ఖో ఖో పోటీలకు ఎంపికైన శ్రీ విజ్ఞాన భారతి పాఠశాల క్రీడాకారుడు


శామీర్ పేట, (గరుడ వార్త) : రాష్ట్ర ఖో ఖో జట్టుకు శ్రీ విజ్ఞాన భారతి పాఠశాల విద్యార్థి అయినా క్రీడాకారుడు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్, మేడ్చల్ జిల్లా ట్రాస్మా ఉపాధ్యక్షుడు గోనే హనుమంత రెడ్డి తెలిపారు. శుక్రవారం శామీర్ పేట మండలం తూముకుంట లోని శ్రీ విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మజ్జి సాయికుమార్ ను అభినందించారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ గత నెల28 న మహబూబ్ నగర్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు తరఫున అండర్



18 విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. దీంతో ఈ నెల 25 నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రము లోని ఆలీగర్ లో జరిగే జాతీయస్థాయి 43వ జూనియర్ నేషనల్ ఖో ఖో ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపల్ జంగారెడ్డితో కలసి ప్రధానోపాధ్యాయురాలు సంగీత, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు రష్మిత, షబానా, రబిత, హేమలత, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## దేశంలోని అన్ని ప్రాంతాల వారికి సైతం అన్ని విధాలా సహకరిస్తాం : ఎంపీ ఈటెల

శామీర్ పేట, (గరుడ వార్త) : దేశంలోని అన్ని ప్రాంతాల వారికి సైతం అన్ని విధాల సహకరిస్తామని ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. శుక్రవారం ఉదయం శామీర్ పేట పెద్ద చెరువులో ఉత్తర భారతీయులు నిర్వహించిన ఛత్ పూజలకు ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ ఉత్తర భారతీయులు ఎంతో నిష్టగా ఈ ఛత్ పూజలు నిర్వహిస్తారన్నారు. ఉత్తర భారతీయులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా మేమంద



చేస్తామని చెప్పారు. ఈటెల ఉత్తర భారతీయులతో కలిసి ఛత్ పూజలలో పాల్గొని సూర్య భగవానునికి పూజలు నిర్వహించారు. ఉత్తర భారతీయ కుటుంబాలకు ఛత్ పూజల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి శామీర్ పేట మండలం మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్ పాల్గొన్నాడు.

## పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

శామీర్ పేట, (గరుడ వార్త) : నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉండబోతోందని శామీర్ పేట విద్యుత్ ఏ ఈ రాఘవేందర్ రావు ఓ ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు. శనివారం దేవర యంజల్ విద్యుత్ సబ్స్టేషన్లో కొత్తపేట ఫీడర్ మరమత్తుల



కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దేవాలయంజాల్ పరిధిలోని శ్రీమతి కన్వెన్షనల్, గోడౌన్స్, పూలింగ్ రోడ్డు, తురుకోని కుంట ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ విషయం విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు

## యాక్సిడెంట్లు నివారించాలంటే నియమ నిబంధనలు అనుసరిస్తూ వాహనాలు నడపాలి : ఇన్స్పెక్టర్ శ్రీనాథ్

శామీర్ పేట, (గరుడ వార్త) : యాక్సిడెంట్లు నివారించాలంటే ప్రతి ఒక్కరు తప్పక నియమ నిబంధనలు అనుసరిస్తూ వాహనాలు నడపాలని శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బిట్స్ జంక్షన్, అలియాబాద్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ



సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు. వాహనాలకు సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ఈ తనిఖీ లలో 49 ద్విచక్ర వాహనాలు, 11 మూడు చక్రాల ఆటోలు, 9 కార్లు మొత్తం 69 వాహనాలు సరైన పత్రాలు లేనందున వారికి కౌన్సిలింగ్ నిర్వహించి చలాన్లు వేసి పంపించినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు హారిక, దశరథ్, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# పునర్వినియోగంపై చెత్తశుద్ధి ఏదీ!

గోదావరిఖని : వ్యర్థాల నిర్వహణలో పాలకుల పట్టింపులేనితనం, అధికారుల నిర్లక్ష్యంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. తడి, పొడి చెత్తను ఇంటి నుంచే వేర్వేరుగా సేకరించాలని ప్రభుత్వాలు ఆదేశిస్తున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. కాగితాల్లో మాత్రం సేకరించినట్లు చూపిస్తున్నారు. పైగా తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నట్లు, పొడి చెత్తను పునర్వినియోగానికి పంపిస్తున్నట్లు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో జరిగేది వేరు. 'స్వచ్ఛ సర్వేక్షణ్' పోటీల్లో భాగంగా నాణ్యత నిపుణులు పరిశీలనకు వచ్చినప్పుడు అయిదారు ఇళ్లల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నట్లు ఆర్భాటం ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరాలు, పట్టణాల్లో చెత్త నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంటి నుంచే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలంటూ పురపాలక నిర్వహణ శాఖ తాజాగా రాష్ట్రంలోని పుర, నగరపాలికలకు ఆదేశాలు జారీ చేయడంతో పరిస్థితి మారుతుందేమో చూడాలి.

**డంపింగ్ యార్డు కొరత**

రామగుండం నగరపాలక ప్రాంతంలో నిత్యం సుమారుగా 120 మెట్రిక్ టన్నుల చెత్త ఏర్పడుతోందని అంచనా. డంపింగ్‌యార్డు లేకపోవడంతో పవిత్రమైన గోదావరి ఒడ్డునే పడేస్తున్నారు. ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరగక చాలా మంది చెత్తను రోడ్లపైనే పడేస్తున్నారు. వాహనాల మరమ్మతుల పేరిట కొన్ని కాలనీల్లో వారాని ఒకరోజు చెత్త సేకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. చెత్త సేకరణ కోసం మరిన్ని ఆటో ట్రాలీలను అందుబాటులోకి తేవడంతో పాటు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తేనే రోజు ఇంటింటా చెత్త సేకరణ సాధ్యం అవుతుంది.

**అత్యాధునిక వాహనాలపై నిర్లక్ష్యం**

రామగుండంలోని గౌతమినగర్‌లోని చెత్త నిర్వహణ కేంద్రంలో కేవలం



పొడి చెత్త నిర్వహణ తప్ప తడి చెత్తను పట్టించుకోవడం లేదు. మెరుగైన చెత్త నిర్వహణ కోసం ఎన్టీపీసీలో, మల్కాపూర్, ఎన్టీఆర్‌నగర్‌లో ప్రత్యేకంగా షెడ్లు నిర్మించారు. అత్యాధునిక యంత్రాలు, వాహనాలను కొనుగోలు చేసినా ఒక్కనాడు వినియోగించలేదు. పొడి చెత్తను గుత్తేదారు కొనుగోలు చేస్తుండడంతో పారిశుద్ధ్య కార్మికులు పొడి చెత్తను వేరు చేసి విక్రయించుకొని ఆదాయం పొందుతుండగా తడి చెత్త నిర్వహణను బల్దియా పట్టించుకోవడం లేదు.

**ఆదర్శం నీరుగారింది**

ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయడానికి రెండు బుట్టలను సుమారు రెండు దశాబ్దాల క్రితమే రామగుండం నగరపాలికలో ఇంటింటా అందజేశారు. పారిశుద్ధ్య ఆటో ట్రాలీల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. అయినా ప్రజలు తడి, పొడి చెత్తను కలిపే వేస్తున్నారు. గతంలో ప్రయోగాత్మకంగా కొన్ని డివిజన్లలో తడి చెత్తతో వారి ఇంటి ఆవరణలోనే సేంద్రియ ఎరువు తయారు చేసుకునేలా అవగాహన కల్పించి పొడి చెత్తను మాత్రమే పునర్వినియోగానికి తరలించడం సత్ఫలితాలు ఇచ్చింది. సుమారు పాతికేళ్ల క్రితం రామగుండం పురపాలికగానున్న కాలంలో గౌతమినగర్‌లో ప్రత్యేకంగా చెత్త నిర్వహణ కేంద్రం ఏర్పాటు చేసి తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారు చేసి 'భూసంజీవని' పేరిట రైతులకు విక్రయించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పుర, నగరపాలికల అధికారులు, పాలకవర్గం ఇక్కడికి వచ్చి పరిశీలించారు. కానీ అధికారులు మారడం, వచ్చినవారు పట్టించుకోకపోవడంతో ఈ కార్యక్రమాలు నీరుగారిపోయాయి.

**ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం- సునీల్ రాథోడ్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

ఇంటినుంచే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. మరిన్ని వాహనాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. చెత్త నిర్వహణను నిరంతరంగా పర్యవేక్షిస్తున్నారు. తాజాగా ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ నగరాన్ని చెత్తరహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటాం.

# అవగాహన లోపం.. ఆర్థిక భారం



గోదావరిఖని: ఔషధాలపై అవగాహన లోపం.. ప్రజలపై ఆర్థిక భారం పడేలా చేస్తోంది.. ఒకే రకమైన కంపోజిషన్‌తో తయారు చేస్తున్న మందుల ధరల్లో భారీ వ్యత్యాసం ఉంది. కంపెనీ ఒక్కటే ఉంటుంది. దానిపై ముద్రించే ధర కూడా ఒకటే. కాని సాధారణ మందుల దుకాణాల్లో దీన్ని ఎక్కువ ధరకు విక్రయిస్తుంటే అదే మందును జన ఔషధ దుకాణాల్లో తక్కువకు అమ్ముతుంటారు. ఈ వ్యత్యాసం తెలియక సాధారణ ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు.

జన ఔషధ దుకాణాలు, ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధ దుకాణాల్లో మందులు అతి తక్కువ ధరకు లభిస్తాయి. వీటిలో సాధారణ మందుల కన్నా రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాల జబ్బులకు సంబంధించిన మందులే ఎక్కువ విక్రయాలు అవుతున్నాయని వాటి నిర్వాహకులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 4,087 సాధారణ మందుల దుకాణాలుంటే.. జన ఔషధ విక్రయ కేంద్రాలు 65 ఉండగా, ప్రధాన మంత్రి భారతీయ జన ఔషద విక్రయ కేంద్రాలు గోదావరిఖని, గంగాధర, చొప్పదండిల్లో ఉన్నాయి.

**రాసింది కొనాల్సిందే!**

ప్రతి ఆస్పత్రికి అనుబంధంగా ఔషధ దుకాణాలున్నాయి. అక్కడి వైద్యులు అందులో లభించే కంపెనీల మందులనే రాస్తారు. దీంతో రోగులు తప్పనిసరిగా అక్కడే కొనుగోలు చేయాల్సి వస్తోంది. చాలామంది వైద్యుల రాత అర్థం కాకుండా ఉంటుంది. వారు సూచించిన ఔషధ దుకాణంలోని వారే అర్థం చేసుకుని ఇస్తారు. దీంతో రోగులు ఇతర దుకాణాలకు వెళ్లడానికి సాహసించరు.

కొంతమంది వైద్యులు తమ దగ్గరికి వచ్చే రోగులకు జనరిక్ ఔషధాలు వాడొద్దని స్పష్టం చేస్తుండటమూ కొనుగోలుకు వెనకాడటానికి కారణమవుతుంది.

**ఎందుకింత తేడా?**

జనఔషధ మందుల దుకాణాలకు ఏజెన్సీలు ఎమ్మార్పీపై 60 శాతం తక్కువకు సరఫరా చేస్తాయి. దీనిపై 10 శాతం లాభం చూసుకుని వారు విక్రయిస్తారు.సాధారణ మందుల దుకాణాలకు ఏజెన్సీలు ఎమ్మార్పీపై 40 శాతం తక్కువకు సరఫరా చేస్తాయి. దీనిపై మరో 40 శాతం కలుపుకొని అమ్ముతున్నారు.సొంత ఆస్పత్రులున్న మందుల దుకాణాల నిర్వాహకులు తమ వైద్యశాలలో ఉన్న మందులనే డాక్టర్లతో రాయిస్తూ భారీ లాభంతో విక్రయిస్తున్నారు.

జనరిక్ మందులను సాధారణ దుకాణాల్లో విక్రయిస్తున్నవారు 15 నుంచి 20 శాతం రాయితీ పేరుతో ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. విషయం తెలియక రాయితీ అని చాలా మంది సాధారణ మందుల దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. అదే మందు జనఔషధ దుకాణాల్లో తక్కువకు వస్తాయి. కానీ తెలియని జనం అటువైపు వెళ్లడం లేదు.

**ఒకేలా పనితీరు- శ్రీనివాస్, ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు, కరీంనగర్**

జనరిక్ మందులపై ప్రజల్లో అవగాహన పెరగాలి. చాలా మందికి ఈ మందుల్లో కంపోజిషన్ తక్కువగా ఉంటుందని అపోహ ఉంది. ఒకే రకమైన ఫార్ములాతో అన్ని కంపెనీలు తయారు చేస్తాయని వారు గుర్తించాలి. సాధారణ మందుల దుకాణానికి, జన ఔషధ దుకాణాల్లో లభించే మందుల పనితీరులో ఎలాంటి తేడా ఉండదు.

# నిర్ణయంలో ఆలస్యం.. అన్నదాతకు నష్టం



భగత్‌నగర్: ఆరుగాలం పంట పండించిన రైతుల్లో అధిక మంది ఏదోరకంగా నష్టపోతూనే ఉంటారు. పాలకుల ప్రణాళిక లేమి.. మిల్లర్లతో కుదరని సయోధ్య.. అధికారుల ఉదాసీనత వెరసి.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. మరో వైపు ప్రభుత్వం ధాన్యం అక్రమదందాకు తెరదించేందుకు తెచ్చిన కొత్త పాలసీని మిల్లర్లు వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం ఆలస్యంగా మేల్కోవడంతో జిల్లా రైతులు ఎలా నష్టపోతున్నారో వివరిస్తూ కథనం.

దసరా తర్వాత కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం తూకాలు వేయడంలో జాప్యం చేయడంతో రైతు అనేక విధాలుగా నష్టపోయాడు. మంత్రి మండలి ఉపసంఘం నెల ముందుగా తీసుకోవాల్సిన నిర్ణయాల్లో జాప్యమైంది. మంత్రి మండలి ఉపసంఘం ధాన్యం కొనుగోలు నూతన పాలసీ నిర్ణయాలను అక్టోబరు 29న జీవో రూపంలో ప్రకటించింది. ఆలస్యం అమృతం విషం అన్నట్లుగా అప్పటికే చాలామంది రైతులు ప్రైవేటుకు అమ్మేశారు. ఇంకొందరి ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోయింది. 20 రోజులు జాప్యం కావడంతో అనేక ఇబ్బందులు పడ్డారు. ఉప సంఘం జీవో కోసం చూడకుండా.. ఆ సమయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించి.. ధాన్యం తూకం వేసే ప్రక్రియ ప్రారంభిస్తే రైతులకు ఇబ్బందులు తప్పేవి.

**ప్రణాళిక అమలులో విఫలం**

జిల్లా యంత్రాంగం వానాకాలం పంట కొనుగోలు ప్రణాళికను మొదట్లోనే ఖరారు చేసుకుంది. కానీ అమలు చేయడంలో విఫలమైంది. అక్టోబరులో 91,894 మెట్రిక్ టన్నులు (23 శాతం) ధాన్యం కొనాలి. ఈ మాసంలో ఒక్క గింజ కూడా కొనలేదు. క్షేత్రస్థాయి సమస్యను తాత్కాలికంగా అధిగమించేందుకు పాలకులు ఉపశమన చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. ఆ దిశగా చర్యలు కరవు అయ్యాయి. అన్నదాత రోదన అరణ్యవేదనగా మారింది.

**బకాయిల గుదిబండా..**

రైస్‌మిల్లర్లు ఏటా తీసుకున్న ధాన్యాన్ని మర ఆడించి సకాలంలో బియ్యం అందివ్వడంలో విఫలమవుతున్నారు. కొందరు తాత్సారం చేయడతో పాటు బియ్యం పక్కదారి పట్టించారు. ఇలా జిల్లాలో సుమారు రూ.146 కోట్ల విలువైన బియ్యం ఇవ్వడంలో మిల్లర్లు విఫలమయ్యారు. రూ.కోట్లలో మిల్లర్ల బకాయిదారులుగా తేలడంతో.. దీని కట్టడికి 2022-23 వరకు మిల్లర్ల వద్ద బకాయి ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం వేలం వేసింది. శాశ్వతంగా బకాయిలు లేకుండా ఉండేందుకు వారి నుంచి పూచీకత్తు తీసుకోవాలని నిర్ణయించింది. పూచీకత్తు విధివిధానాల ఖరారుకు మంత్రి మండలి ఉపసంఘం ఏర్పాటు చేసింది.

**కొత్త విధానాన్ని వ్యతిరేకిస్తున్న మిల్లర్లు**

నూతన ధాన్యం కొనుగోలు విధానంలో మిల్లర్ల నుంచి పూచీకత్తు తీసుకోవాలని ఉంది. ధాన్యం పక్కదారిపట్టకుండా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. మిల్లర్ల చరిత్ర ఆధారంగా మూడు విభాగాలుగా విభజించింది. పూచీకత్తు అడగడంతో మిల్లర్లు గగ్గోలు పెడుతున్నారు. పదేళ్లుగా లేని పూచీకత్తు ఇప్పుడు ఇవ్వలేమంటున్నారు. గతేడాది ప్రభుత్వం మిల్లర్లు తమ భాగస్వామ్యం అమ్ముకోకుండా.. మిల్లులు విక్రయించకుండా ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేశారు. మిల్లింగ్ నష్టాలపై పునఃసమీక్ష చేయాలని కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసిన అనంతరం.. మిల్లుల కేటాయింపునకు ఇబ్బంది తలెత్తే అవకాశముంది. ప్రభుత్వం, మిల్లర్ల మధ్య సయోధ్య కుదరకపోతే రైతుకు నష్టం వాటిల్లే అవకాశముంది.

**ఎట్టకేలకు షురూ**

గంగాధర, లక్ష్మీదేవిపల్లి, మధురానగర్, నాగిరెడ్డిపూర్, నారాయణపూర్, బూర్గుపల్లి, చర్లపల్లి ఎన్, ర్యాలపల్లి, కొండాయపల్లి, వెంకటాయపల్లి, నర్సింహులపల్లి, లింగంపల్లి, గట్టుబూత్కూర్, కురిక్యాల, మల్లాపూర్ గ్రామాల్లోని కేంద్రాల్లో మంగళవారం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు ప్రారంభంలో ఆర్భాటం.. కొనడంలో ఆలస్యం', 'దసరా పాయె.. దీపావళి వచ్చే..ధాన్యం కొనరాయె', 'ధాన్యం దళారుల పాలు', 'కొనరేమి.. రైతుగోడు వినరేమి' శీర్షికలతో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. కొన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. అయితే హమాలీలు, కాంటాలు పెంచి వరి ధాన్యం కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాల్సి ఉంది.

# అధికారి నిర్లక్ష్యం.. రైతుకు శాపం

మధిర : వ్యవసాయ శాఖలోని అధికారుల నిర్లక్ష్యం ఓ రైతుకు శాపంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఏటా ఖరీఫ్‌లో ఎవరెవరు ఎన్ని ఎకరాల్లో, ఏఏ పంటలు సాగు చేశారనే వివరాలను వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు ఆన్‌లైన్ నమోదు చేస్తుంటారు. మధిర మున్సిపాలిటీలోని జిలుగుమాడు గ్రామానికి చెందిన యన్నం కోటేశ్వరరావు పదెకరాల్లో పచ్చపెసలు సాగు చేశారు. తక్కువ పెట్టుబడితో ఎకరాకు మూడున్నర క్వింటాళ్ల చొప్పున నాణ్యమైన దిగుబడి సాధించారు.



వాటిని ఇంటికి చేర్చాక విక్రయించుకునేందుకు కావల్సిన ధ్రువీకరణ పత్రం పొందేందుకు కొద్ది రోజుల క్రితం రైతువేదిక వద్దకు వెళ్లారు. సదరు వ్యవసాయ విస్తరణాధికారి 'మీరు పెసలు సాగు చేసినట్లు ఆన్‌లైన్‌లో లేదు కదా? ధ్రువీకరణ పత్రం ఇవ్వటం కుదరద'ని తేల్చిచెప్పారు. దీంతో రైతు లబోదిబోమన్నారు. బయట మార్కెట్లో క్వింటా ధర రూ.6500 ఉంటే, మార్కెట్లో ప్రభుత్వం ధర రూ.8600... క్వింటాకు రూ.1900 వ్యత్యాసం ఉంది. భారీగా తేడా ఉండటంతో ఏం చేయాలో పాలుపోక ఇంట్లోనే నిల్వ చేశారు. వారానికోసారి రసాయన మందులు పిచికారి చేస్తూ ఉత్పత్తిని కాపాడుతున్నారు. ఈ విషయమై ఏడీఏ విజయ్‌చంద్రను వివరణ కోరగా డివిజన్‌లో కొంతమంది రైతుల సాగు వివరాలు ఇలా ఆన్‌లైన్‌లో నమోదు కాలేదన్నారు. అలాంటి వాటి విక్రయాలకు ప్రభుత్వపరంగా అగ్రికల్చర్ ప్రొడక్షన్ కమిషన్ అనుమతి ఇవ్వాల్సి ఉందని, కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు వెళ్లాయన్నారు. అనుమతి రాగానే బాధిత రైతు నుంచి కొనుగోలు చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# యార్డులో స్థలం కొరత

జగిత్యాల : జగిత్యాలలోని వ్యవసాయ మార్కెట్యార్డుకు రైతులు గతకొన్ని రోజులుగా పెద్దఎత్తున ధాన్యం, మక్కలను అమ్మకానికి తెస్తున్నారు. జగిత్యాలతో పాటుగా చుట్టుపక్కల మండలాల రైతులు భారీగా దినుసులను తేవటంతో యార్డులో స్థలం సరిపోవటంలేదు. దసరా నుంచే రైతులు వరికోతలు ప్రారంభించగా దీపావళి దాటినా పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ప్యాక్స్, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం సేకరణ మొదలుగాకపోవటంతో రైతులు ప్రత్యామ్నాయ ధాన్యం విక్రయంపై దృష్టిసారించారు. చాలామంది రైతులు మిల్లుల్లో ధాన్యాన్ని విక్రయిస్తుండగా మరికొన్నిచోట్ల మధ్యవర్తులు గ్రామాల్లో రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్నారు. దీంతోపాటు చాలామంది రైతులు ధాన్యం, మక్కలను జగిత్యాల యార్డులకు తెచ్చి విక్రయిస్తున్నారు.

**స్థిరమైన ధర**

జగిత్యాల బీటుకు ఒక్కరోజే 712 క్వింటాళ్ల మక్కలను రైతులు విక్రయానికి తేగా క్వింటాలుకు కనిష్ఠంగా రూ.1,800 నుంచి రూ.2,502 ధర పలికింది. ప్రభుత్వ మద్దతు ధర మక్కలకు రూ.2,225 ఉండగా బీటులో సరాసరిగా 2,355 ధర పలికింది. 3,959 క్వింటాళ్ల ఎంటీయూ1010 రకం ధాన్యాన్ని అమ్మకానికి తేగా రూ.1,700 నుంచి రూ.1,925 ధర పలికింది. 247 క్వింటాళ్ల బీపీటీ ధాన్యాన్ని విక్రయించగా రూ.2,234 నుంచి రూ.2,290 ధర పలికింది. 1,872 క్వింటాళ్ల జైశ్రీరాం ధాన్యాన్ని రైతులుతేగా రూ.2,401 నుంచి రూ.2,735 చొప్పున ధర పలికింది. చాలా మంది రైతులు హార్వెస్టర్లతో నూర్పిడి చేసిన వెంటనే ట్రాక్టర్లతో పచ్చిధాన్యాన్ని నేరుగా యార్డుకు తెస్తున్నారు. నిరుడు ఆరబెట్టి తెచ్చిన జైశ్రీరాం రకం ధాన్యానికి రూ.3,300 ధర పలికింది. ఈ సీజన్‌లో సన్నధాన్యాన్ని ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించి కొనుగోలు చేస్తామనగా బోనస్‌తో కలుపుకొని



రూ.2,820 ధర చెల్లించనున్నారు. జైశ్రీరాం వంటి సూపర్‌ఫైన్ రకాలకు ఇంతకన్నా అధిక ధరలు పలికే అవకాశముందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

**ఇబ్బందుల్లేకుండా కొనుగోలు** – టి.రాజశేఖర్, మార్కెట్ కమిటీ కార్యదర్శి

అప్పుడప్పుడు ఆన్‌లైన్‌లో సమస్య తలెత్తి ఈ-నామ్ బిడ్డింగ్ వీలుగాకున్నా రాతపద్ధతిలో కొనుగోళ్లు జరుపుతూ రైతులకు ఇబ్బంది రాకుండా చూస్తున్నాము. ప్రస్తుతం పెద్దఎత్తున ధాన్యం, మక్కలు బీటుకు వస్తుండగా కొనుగోలు, తూకంవేసిన ధాన్యం బస్తాల తరలింపు ఏరోజుకారోజు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాము.

**రైతులకు భరోసా**– చిక్కుల భూమయ్య, అడ్తీ ఖరీదుదారుల సంఘం అధ్యక్షుడు

బీటులో దినుసులు విక్రయించే రైతులకు కచ్చితమైన తూకం, డబ్బుల చెల్లింపు తదితరాల భరోసా ఉంటుంది. ప్రస్తుతం మక్కలు, సన్నవడ్లకు మంచి ధరలున్నాయి. మిల్లర్లు, ఇతరప్రాంతాల వ్యాపారులు యార్డుకు వస్తున్న నాణ్యమైన సరకులను సేకరించడానికి మొగ్గు చూపుతుండటంతో ధరలు తగ్గకుండా ఉంటున్నాయి.

# సాగుబడి.. ఇప్పుడిదే ఒరవడి

వైరా : అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు చెందిన చివరి సంవత్సరం చదువుతున్న పలు జిల్లాలకు చెందిన విద్యార్థులు తమకు నిర్దేశించిన గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం (రావెప్)లో భాగంగా గ్రామాల్లోనే ఉంటూ రైతులతో మమేకవుతున్నారు. మూడేళ్లపాటు తరగతి గదుల్లో నేర్చుకున్న వ్యవసాయ పాఠాల అనుభవాలు క్షేత్రంలో ఎలా ఉంటాయో తెలుసుకునేందుకు పొలం బాట పట్టారు. కేవీకే శాస్త్రవేత్త జెస్సీ సునీత పర్యవేక్షణలో విద్యార్థులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు.

**వంద రోజులు రైతులతోనే..**

వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల పర్యవేక్షణలో వంద రోజులపాటు పూర్తిగా గ్రామాల్లోనే ఉంటూ రైతులతో పొలం బాట పట్టి తమకు తెలిసింది నేర్పిస్తూ రైతుల నుంచి ఎన్నో అనుభవాలు నేర్చుకుంటున్నారు. వ్యవసాయ కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థినులు, విద్యార్థులు ఎంపిక చేసిన గ్రామాల్లో ఉంటున్నారు. వైరా మండలం గన్నవరం, వల్లాపురం, సోమవరం, కొణిజర్ల మండలం పల్లిపాడు, తల్లాడ మండలం కుర్నవల్లి, ముదిగొండ మండలం ముదిగొండ, వెంకటాపురం, రాఘవాపురం, మేడేపల్లి, సువర్ణాపురంలో ఒక్కో చోట ఐదుగురు విద్యార్థులుంటున్నారు. ఆయా గ్రామాల్లో చైతన్యంతమైన రైతులతో మమేకమయ్యేలా కేవీకే శాస్త్రవేత్తలు దిశానిర్దేశం చేశారు. వరి, మిరప, పత్తితోపాటు ఇతర పంటల్లో ఆది నుంచి తుది వరకు యాజమాన్య పద్ధతులను వీరు పరిశీలిస్తూ సమగ్ర అధ్యయనం చేయాల్సి ఉంది. పంటకు పొలం సిద్ధం చేయడం, విత్తనాలు నాటి, మొలకెత్తడం, కాపు దశ, పంట చేతికొచ్చే తరుణం, ఆయా క్రమంలో వచ్చే చీడపీడలు ఇతర ప్రతికూలతల నుంచి వాతావరణ విపత్కర పరిస్థితులను అంచనా వేసే క్రమంలో రైతులు



ఏయే విధానాలు అవలంభిస్తారనే అంశాలను అంచనా వేయాల్సి ఉంటుంది. రైతుల అనుభవాలను జోడించుకుంటూ తరగతి గదుల్లో తమకు నేర్పిన విజ్ఞానాన్ని వారికి అందించాల్సి ఉంది. వంద రోజుల క్షేత్ర శిక్షణలో భాగంగా ప్రతి వారం వైరా కేవీకేలో సమీక్ష చేసి మరిన్ని వ్యవసాయ పద్ధతులు, అనుభవాలను మేళవింపు చేసి మరింత అవగాహన అందించే కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఆగస్టు రెండో వారంలో మొదలైన క్షేత్ర పర్యటన ఈనెలాఖరుతో ముగియనుంది.

**ఎంతో ఉపయోగం - క్రిషిక, ఖమ్మం**

ఒద రోజుల పొలం బాట ఎంతో ఉపయోగపడింది. నాలుగేళ్ల చదువు పూర్తయ్యాక ఉన్నత చదువులు, ఉద్యోగాన్వేషణలో వ్యవసాయ సాగు అనుభవాలు ఎంతో ఉపయోగపడ్డాయి.

**రైతుల నుంచి తెలుసుకుంటున్నాం- నందిత, మహబూబాబాద్**

గత మూడు నెలలుగా రైతులతో మమేకవుతున్నాం. వారి నుంచి ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. గ్రామంలోనే ఉంటూ రైతులతో వ్యవసాయ సాగు పద్ధతులు నేర్చుకున్నాం. సాగు చేసే తరుణంలో రైతులు ఎదుర్కొనే ఎన్నో అంశాలపై సమగ్ర అవగాహన వచ్చింది.

**కర్షకుల ఇబ్బందులు తెలిశాయి..- కీర్తన, వరంగల్**

వంద రోజుల క్షేత్ర పర్యటనలో భాగంగా పంటల సాగులో రైతుల ఇబ్బందులను నేరుగా తెలుసుకోగలిగాం. రైతులు అవలంభిస్తున్న కొన్ని పద్ధతులు వినూత్నంగా ఉండటమే కాకుండా ఎంతో నేర్చుకోగలిగే పద్ధతులు వివరించారు.

**గ్రామీణ ప్రాంతాలపై అవగాహన- అమృతవర్ష, కొత్తగూడెం**

పొలంబాటలో భాగంగా గ్రామీణ ప్రాంతాల పరిస్థితులు, రైతుల సాగు పద్ధతులతో పాటు వారి విజయగాథలపై ఎంతో అవగాహన వచ్చింది. అధునాతన విజ్ఞానంకు దీటుగా రైతులు ఎప్పటి నుంచో ఆయా సాగు మెలకువలు పాటిస్తున్నారు.

అన్నదాతలకు నేర్పించాంఎ.ముఖేశ్‌కుమార్, హైదరాబాద్

క్షేత్రంలో రైతుల నుంచి ఎన్నో అనుభవాలను నేర్చుకోవడమే కాకుండా వారికి ఎంతో నేర్పించాం. రసాయన ఎరువుల వినియోగం అధికమైతే ఎలాంటి ఇబ్బందులు వస్తాయో చెప్పి సేంద్రీయ ఎరువుల వినియోగంపై అవగాహన పెంచాం.

# సహకారం.. ఉపకారం

ఖమ్మం : బంగారం తాకట్టు రుణాల్లో ఖమ్మం డీసీసీబీ(జిల్లా కేంద్ర సహకార బ్యాంకు) ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో మొత్తం 9 డీసీసీబీలు ఉన్నాయి. ఇప్పటి వరకు కరీంనగర్ జిల్లా మొదటి స్థానంలో ఉండగా దాన్ని అధిగమించి ఖమ్మం ముందుకు సాగటం విశేషం. ఈ బ్యాంకులో రైతులతో పాటు వివిధ వర్గాలకు చెందిన ఖాతాదారులున్నారు. కొన్ని నెలల నుంచి బంగారం తాకట్టు రుణాలపై బ్యాంకు విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. కేవలం పది నిమిషాల్లోనే రుణం మంజూరు చేస్తామని ప్రకటించి దాన్ని పక్కాగా అమలు చేసింది. దీంతో డీసీసీబీ పరిధిలోని శాఖల్లో అనేక మంది ఈ రుణాలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. నిబంధనలు



సరళతరంగా ఉండటం, వెళ్లిన వెంటనే జాప్యం లేకుండా మంజూరు చేయటం, బకాయిలు చెల్లించిన వెంటనే ఆభరణాలను విడుదల చేయటం వల్ల రుణాలు తీసుకునే వారి సంఖ్య పెరిగింది. కొంతకాలం నుంచి వరుస ఘటనలతో అట్టుడుకుతున్న బ్యాంకుకు రాష్ట్రంలో ప్రథమ స్థానం రావటం ఒక విధంగా ఊరటగానే చెప్పవచ్చు. బ్యాంకులో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది సమష్టి కృషి వల్లనే ఇది సాధ్యమైందని డీసీసీబీ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, సీఈఓ వసంతరావు తెలిపారు.

ఇదీ ప్రత్యేకత....బంగారు ఆభరణాల తాకట్టుపై రూ.25 లక్షల వరకు తక్షణ రుణ సదుపాయం, ఎక్స్‌ప్రెస్ గోల్డ్‌లోన్‌కు గ్రాముకు రూ.5,200, సాధారణ బంగారు రుణానికి గ్రాముకు రూ.5,000, కేవలం 10 నిమిషాల్లోనే రుణం మంజూరు

# అర్హతకు మించి వైద్యం

కొత్తగూడెం : చుంచుపల్లి మండలంలో ఓ గ్రామీణ వైద్యుడు తనను ఆశ్రయించే రోగులకు రక్త పరీక్షలు సైతం సిఫార్సు చేస్తున్నాడు. క్లినిక్‌లో మూడు పడకలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నాడు. అర్హతకు మించి వైద్యం అందిస్తున్నాడన్న ఫిర్యాదుతో వైద్యారోగ్య శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి క్లినిక్‌ను ఇటీవల సీజ్ చేశారు.

"ఆళ్లపల్లి మండలంలో మరో గ్రామీణ వైద్యుడు ఎంబీబీఎస్ వైద్యుడి స్థాయిలో నాలుగు పడకల క్లినిక్ నిర్వహిస్తున్నాడు. ఏకంగా ఫ్లూయిడ్స్ పెడుతున్నాడు. తెలిసీ తెలియని వైద్యంతో రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాడని ఫిర్యాదులు రావడంతో ఈయన చికిత్స కేంద్రాన్నీ మూసేశారు".

"లక్ష్మీదేవిపల్లి మండలంలో మరో ఆర్‌ఎంపీ క్లినిక్‌కు తోడు మెడికల్ దుకాణాన్నీ సైతం నిర్వహిస్తున్నాడు. అదీ.. ఏ లైసెన్స్ లేకుండానే! లైసెన్స్‌డ్ దుకాణాల్లో విక్రయించాలని ఔషధాలను రోగులకు ఇస్తూ ఔషధ తనిఖీ అధికారులకు పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదు చేశారు."

బాధితుల్లో కొందరు ఆరోగ్య పరిస్థితి విషమించాక కార్పొరేట్, ప్రైవేట్ దవాఖానాలకు పరుగెత్తుతున్నారు.

జిల్లాలో కొందరు గ్రామీణ వైద్యులు, ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్లు (పీఎంపీలు) అర్హతకు మించి వైద్యాన్ని అందిస్తున్నారు. తరుణ వ్యాధుల సీజన్ కావడంతో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే క్రమంలో రోగుల



ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు అని కొందరు వైద్యారోగ్య శాఖకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇటీవల తనిఖీలు చేపట్టిన జిల్లా అధికారులు పలు క్లినిక్‌లను మూసేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఎంబీబీఎస్ వైద్యులకు సమాంతరంగా ఏర్పాటు చేసుకుని అర్హతకు మించి వైద్యం చేస్తున్నారని గుర్తించారు.

ఇవీ నిబంధనలు ఆర్‌ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే బోర్డు రాసుకోవాలి. రక్త పరీక్షలు చేయొద్దు. సొంతంగా ఇంజెక్షన్లు వేయొద్దు. పడకలు ఏర్పాటు చేయొద్దు. ఫ్లూయిడ్స్ వంటివి ఎక్కించకూడదు. యాంటీబయాటిక్ ఇంజెక్షన్లను ఎక్కించొద్దు. పారాసెటమల్ వంటి మాత్రలు ఇవ్వడం, కట్లు కట్టడం వంటివి మాత్రమే చేయాలి. వైద్య నిపుణులు సిఫార్సు చేసిన ఇంజెక్షన్లే రోగికి ఇవ్వాలి. కేంద్రాల నిర్వహణకు అనుమతి విధిగా పొందాలి. 'క్లినిక్' అనే పదాన్ని బోర్డుపై వినియోగించకూడదు. గర్భిణులు, చిన్న పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో చికిత్స చేయొద్దు.

రోగుల ప్రాణాలతో చెలగాటం..

జిల్లావ్యాప్తంగా 23 మండలాల పరిధిలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు సేవలందిస్తున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చేపట్టిన సోదాల్లో దాదాపు 80 శాతం మంది అర్హతకు మించి వైద్యం అందిస్తున్నట్లు తేలింది. కొందరు ఆర్‌ఎంపీలు సహాయకులను నియమించుకుని, పడకలు ఏర్పాటు చేసుకుని వైద్యం చేయడాన్ని చూసి అధికారులు అవాక్కయ్యారు. మధుమేహం, రక్తపోటు, ఇతర జ్వర నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నారు. చిన్న చిన్న శస్త్రచికిత్సలు వారే చేస్తున్నారు. మరికొందరు అనుమతి లేకుండా మెడికల్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. వైద్య నిపుణులు సైతం ఆలోచించే యాంటీ బయాటిక్స్‌ను విచ్చలవిడిగా వాడుతున్నారు. స్టెరాయిడ్స్ కూడా ఇస్తున్నట్లు తనిఖీల్లో తేలింది. దీనివల్ల రోగి సత్వరంగా కోలుకున్నా, ఆ తర్వాత దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతుంటారని వైద్యాధికారులు చెబుతున్నారు. రోగం ఒకటైె.. మందు మరొకటి వినియోగిస్తే రోగ నిరోధక శక్తి తగ్గుతుందని, మూత్రపిండాలు.. కాలేయ వ్యాధులు ప్రబలుతాయని హెచ్చరిస్తున్నారు. ఇటీవల లక్ష్మీదేవిపల్లి మండలం పెనగడపలో ముగ్గురు ఆర్‌ఎంపీల వద్ద వైద్య పొందిన ఓ వృద్ధుడు శరీరమంతా బొబ్బలు తేలి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. ఖమ్మం, హైదరాబాద్ ఆసుపత్రుల్లో రూ.6 లక్షలు ఖర్చు చేసి చికిత్సపొందాక కానీ కోలుకోలేదు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు విస్తృతంగా చేపట్టాలని, స్థాయికి మించి వైద్యం చేస్తున్నవారిపై కంటితుడుపు చర్యలకు బదులు పటిష్ఠంగా కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం

డా.ఎల్.భాస్కర్ నాయక్, ఇన్‌ఛార్జి డీఎంహెచ్ఓ

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం. కొందరు సొంతంగా సంఘం ఏర్పాటు చేసుకుని చట్టానికి అతీతంగా వ్యవహరిస్తాం అంటే కుదరదు. సొంత చికిత్సలు, స్థానిక వైద్యం స్థాయులు-పర్యవసానాలపై ప్రజలను కూడా చైతన్యపరుస్తున్నాం. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలొస్తే నేరుగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులను సంప్రదించాలి. వారి సూచన ప్రకారమే మందులు, ఇంజెక్షన్లు వినియోగించాలి. అర్హతకు మించి వైద్యం చేస్తున్న వారు పద్ధతులు మార్చుకోకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం.

## వైటీపీఎస్‌లో వరుస చోరీలు

దామరచర్ల :యాదాద్రి థర్మల్ విద్యుత్తు ప్లాంటులో వరుస చోరీలు జరుగుతున్నాయి. ప్లాంటు పనులు ప్రారంభమైన ఏడేళ్ల కాలంలో సుమారు రూ.వంద కోట్ల విలువైన ఇనుము చోరీకి గురైనట్లు తెలుస్తోంది. పట్టుబడిన సందర్భాలలో పోలీసులు నామమాత్రపు కేసులు నమోదు చేస్తుండటంతో దొంగతనాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. తాజాగా శనివారం సాయంత్రం ఇనుము సామగ్రితో వాహనం పవర్‌ప్లాంటు నుంచి రాగా.. విశ్వసనీయ సమాచారం మేరకు వాడపల్లి పోలీసులు పట్టుకున్నారు. విచారించగా ఇనుము కొనుగోలుదారు, దందాకు పాల్పడే వారి వివరాలు బహిర్గతమైనట్లు తెలుస్తోంది. సాత్‌తండా, దుబ్బతండాకు చెందిన ముగ్గురు ఈ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. వీరి ద్వారా ప్లాంటులో పనిచేసే వివిధ సంస్థల ఇంజినీర్లు, ఉద్యోగులు పాత ఇనుమును వాహనాలలో తరలిస్తున్నారు. ఇందుకు భారీగా నగదు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. రెండు నెలల క్రితం ఇనుము చోరీ చేసే ముఠా పోలీసులకు పట్టుబడింది. వీరి వెనుక మిర్యాలగూడ పట్టణానికి చెందిన కొందరు వ్యాపారులు ఉన్నారని తెలుస్తోంది. కొద్ది రోజుల వ్యవధిలోనే చోరీలు పునరావృతం కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

సీపీఎఫ్ ఆధీనంలో ఉన్నా.. వైటీపీఎస్ ప్లాంటు పనులు 2017లో ప్రారంభం కాగా.. 2022 వరకు ప్లాంటు భద్రతను సివిల్ పోలీసులు చూసేవారు. ఏడాదిన్నర క్రితం ప్లాంటు రక్షణను సీపీఎఫ్(ప్రత్యేక రక్షణ బృందం)కు అప్పగించారు. ఒక డీఎస్పీ, సీఐ, ఇద్దరు ఎస్సైలతో పాటు 70 మంది సీపీఎఫ్ సాయుధ బలగాలు నిరంతరం కాపలాగా ఉంటున్నారు. అంతేగాక ప్లాంటు చుట్టూ వాచ్‌టవర్లు, సీసీకెమెరాల పర్యవేక్షణ ఉన్నప్పటికీ చోరీలు ఆగకపోవడం గమనార్హం.

ఎక్కడ చూసినా సామగ్రి.. నిర్మాణానికి అవసరమయ్యే ఇనుము, అల్యూమినియం, కాపర్ సామగ్రిని ప్లాంటు లోపల, వెలుపల ఇష్టానుసారంగా నిల్వ ఉంచారు. ప్లాంటు నిర్మాణ బాధ్యతను బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించామని, సామగ్రి రక్షణ బాధ్యత తమకు లేదని ప్లాంటు సీఈ సమ్మయ్య ఇటీవల వెల్లడించడం విశేషం. రూ.కోట్ల విలువైన ఇనుము సామగ్రిని ఇష్టానుసారంగా వదిలేయడంతో చోరీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొంత సామగ్రి తుప్పు పట్టినట్లు తెలుస్తోంది. టీవీగూడెం వైపు నిల్వ ఉన్న సామగ్రి చుట్టూ రక్షణ కంచె లేకపోవడంతో చోరీలు సులువుగా జరుగుతున్నాయి.

# రాజులు ఏలిన ప్రాంతాలు.. ప్రకృతి సోయగాలు

కరీంనగర్ : జలపాతాలు, చారిత్రక కట్టడాలు, పురాతన దేవాలయాలు.. ఉమ్మడి జిలా పర్యాటకుల మనసులను పులకరింపజేస్తాయి. యాత్రికులను ఆకట్టుకునే పుణ్యక్షేత్రాలు.. రాజులు పాలించిన ప్రాంతాలను ఇప్పటికీ వేలమంది సందర్శిస్తున్నారంటే వీటి ప్రాధాన్యత ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఆయా ప్రాంతాల్లో సౌకర్యాలు.. వసతులు కల్పిస్తే మరింత ఆదాయం సమకూరనుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పర్యాటక క్షేత్రాల విశేషాలు, వాటి అభివృద్ధి అనుకూలతలపై 'న్యూస్‌టుడే' కథనం.

కోటలు.. చరిత్రకు ఆనవాళ్లు

ప్రదేశం: ఎలగందుల ఖిల్లా, కరీంనగర్ జిల్లా

నిర్మించినది : శాతవాహనులు. కోటి లింగాలను రాజధానిగా ప్రాంతీయ ఏడు రాజులు గోభద, నారన, కంవయస, సమగోప పాలనలో నిర్మితమైనట్లు లభ్యమైన నాణేలను బట్టి తెలుస్తుంది.

ప్రత్యేకత : ఈ కోట శాతవాహనులతోపాటు బాదామి చాళుక్యుల (550-750) నుంచి ఆసఫ్‌జాహీల(1724-1948) కాలం వరకు పాలన కేంద్రంగా విరాజిల్లింది. ఒకప్పుడు జిల్లా కేంద్రంగా ఉండేది.

కల్పించాల్సిన సౌకర్యాలు : ఎలగందుల ఖిల్లా చారిత్రక ప్రాంతం కావడంతో ప్రభుత్వం 2014లో పర్యాటక కేంద్రంగా ప్రకటించి.. సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేశారు. అయితే కొద్ది రోజులకే నిలిచిపోయింది. సామగ్రి దెబ్బతింది. పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే గార్డెన్స్, పార్కులు, రెస్టారెంట్లు, రవాణా సౌకర్యాలు, వసతులు కల్పించాల్సి ఉంది. కోట గురించి ఈతరం వారికి తెలియజేసేలా తీర్చిదిద్దాలి.

ప్రదేశం: మొలంగూరు ఖిల్లా, కేశవపట్నం మండలం, కరీంనగర్ జిల్లానిర్మించినది : ప్రతాపరుద్రుని అధికారులలో ఒకరైన వొరగిరి మొగ్గరాజు దీనిని నిర్మించాడు.

ప్రత్యేకత : దూద్ బావి బహుళ ప్రాచుర్యం

కల్పించాల్సిన సౌకర్యాలు : గుట్టపైన, కింద కోనేరులు.. దూద్ బావి, శివాలయం, వీరభద్రాలయం, కోట బురుజులు, రాతి ద్వారాలు, కందకాలు, ఫిరంగులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడి దూద్ బావిలోని నీరు ఏ కాలంలో అయినా పాల వలె తెల్లగా ఉంటాయి. ఈ నీరు ఆరోగ్యానికి మంచిదని అక్కడి గ్రామస్థులు తీసుకెళతారు.. ఈ ప్రాంతంలో సుందరీకరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రదేశం: రామగిరి ఖిల్లా, కమాన్‌పూర్ మండలం బేగంపేట, పెద్దపల్లి జిల్లా

నిర్మించినది : శాతవాహనులు నిర్మించారని చారిత్రక అధారాలు చెబుతున్నాయి. వారు దీనిని రక్షణ కోటగా వినియోగించుకొని కోటి లింగాలను రాజధానిగా చేసుకొని పాలించారు.

ప్రత్యేకత : శత్రుదుర్భేధ్యమైన ఈ కోట అరుదైన శిల్పకళ, బురుజులకు నిలయం. కోట పరిసర ప్రాంతాల్లో వనమూలికల సంపత్తి, అరుదైన వృక్షాలున్నాయి.

కల్పించాల్సిన సౌకర్యాలు : ఇక్కడ వనమూలికలు, అరుదైన వృక్షాలను చూసేందుకు వివిధ రాష్ట్రాల శాస్త్రవేత్తలు, ఆయుర్వేద నిపుణులు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వస్తారు. ఈ కోటకు అన్ని రకాలు వసతులు, సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేస్తే ఉమ్మడి జిల్లాలోనే సుందరమైన ప్రదేశంగా విరాజిల్లుతుంది. వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులకు బొటానికల్ పర్యటన క్షేత్రంగా మారనుంది.

ప్రదేశం: కరీంనగర్ మానేరు జలాశయం

సాగు, తాగు నీటి అవసరాలు తీర్చేందుకు కరీంనగర్‌లో మానేరు డ్యాం నిర్మాణం చేశారు. ఈ డ్యాంను ఆనుకొని ప్రభుత్వం ఉజ్వల, జింకల పార్కులు, హరిత హెూటల్ నిర్మించారు.

కల్పించాల్సిన సౌకర్యాలు: మానేరు డ్యాంపై నీడ వసతి, ఫుడ్ కోర్టులు పెరగాల్సిన అవసరముంది. కొదురుపాక మధ్య మానేరులోనూ వసతులు, సౌకర్యాలు పెంచితే బోటింగ్‌కు సందర్శకుల సంఖ్య పెరగనుంది. ఉజ్వల, జింకల పార్కులను మరింత ఆకర్షించేలా తీర్చిదిద్దాలి.

హరిత హెూటల్‌ను త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉంది. ఇస్కాన్ టెంపుల్, తితిదే వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణంతోపాటు మానేరు రివర్ ఫ్రంట్, తీగల వంతెన ప్రాంతాలను తీర్చిదిద్దితే జిల్లాలో పర్యాటకులు పెరగనున్నారు. కోటి రూపాయాలతో తయారైన క్రూజ్ పడవను త్వరలో నడిపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ప్రదేశం: వేములవాడ శ్రీరాజరాజేశ్వర దేవాలయం

నిర్మించినది : పశ్చిమ చాళుక్య చక్రవర్తి ఆరో విక్రమాదిత్యుని మహామండలేశ్వరుడైన రాజాదిత్యుడు రాజరాజేశ్వర దేవాలయం నిర్మించాడని శిలాశాసనం ద్వారా తెలుస్తుంది.

ప్రత్యేకత : దక్షిణ కాశీగా విరాజిల్లుతుంది. వివిధ రాష్ట్రాలకు చెందినవారు ఇక్కడి దర్శనానికి వస్తుంటారు.

కల్పించాల్సిన సౌకర్యాలు : ప్రసాద్ లాంటి కేంద్ర పథకాలు వేములవాడతోపాటు కొండగట్టు, ధర్మపురి, ఇల్లందకుంట దేవాలయాలకు వర్తింపజేయాలి. రాష్ట్ర ప్రభుత్వం సైతం మరిన్ని నిధులు మంజూరు చేసి మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించాలి. రవాణా పరంగా రైల్వేలైన్ వేయాల్సి ఉంది.

ప్రదేశం: గోదావరిఖని గనులు

సహజ నిక్షేపాలుగా బొగ్గు గనులు బయటపడ్డాయి.

ప్రత్యేకత : భూగర్భ గనుల తవ్వకాలు, ఓపెన్ కాస్ట్ మైనింగ్ పనులతోపాటు పవర్ ప్లాంట్‌లు ఉన్నాయి.

కల్పించాల్సిన సౌకర్యాలు : గతంలో ఆర్టీసీ, మైనింగ్ సంస్థలు కలిసి పర్యాటకుల సందర్శనకు అవకాశం కల్పించారు. బస్సు సర్వీసు ద్వారా తీసుకొచ్చి ఖనిలో జరుగుతున్న బొగ్గు గనుల తవ్వకాలు, ఈ ప్రాంత విశేషాలు చూపించేవారు. అనంతరం నిలిపివేశారు. పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

# మేం..డిజిటల్ సర్వే చేయలేం..!



కొత్తగూడెం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'డిజిటల్ పంట సర్వే'కు ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పంటల సర్వే బాధ్యతలను వ్యవసాయ విస్తరణాధికారులకు సర్కారు అప్పగించింది. ఈమేరకు శిక్షణ, యాప్‌లను ఏఈఓలకు అందించింది. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సర్వే ప్రారంభించాల్సి ఉండగా.. పని ఒత్తిడి, సిబ్బంది కొరత వంటి కారణాలతో సర్వే చేయలేమంటూ ఏఈఓలు చేతులెత్తేస్తున్నారు. వ్యవసాయ శాఖలోని 49 రకాల పనులు చేస్తూనే.. డిజిటల్ సర్వే నిర్వహించటం అసాధ్యమంటున్నారు. పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి తమకు సహాయక సిబ్బందిని నియమిస్తే సర్వే చేస్తామని చెబుతున్నారు.

ఎందుకీ పంట సర్వే..?

భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఆహారభద్రత, పంటల బీమాతోపాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయటం, ఆహార ధాన్యాల ఎగుమతి, పంటల కొనుగోలు, సాగు ప్రణాళిక, మార్కెటింగ్ తదితరాలకు డిజిటల్ పంట సర్వే ముఖ్యభూమిక పోషించనుంది. ఇందులో భాగంగా వ్యవసాయ రంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(డీపీఐ)ని రూపొందించే లక్ష్యంతో 'డిజిటల్ అగ్రి మిషన్' పథకాన్ని కేంద్రం తీసుకొచ్చింది. దీని అమలుకు రూ.2,817 కోట్లు వెచ్చిస్తోంది. రైతులకు ప్రయోజనం చేకూర్చటానికి, వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచటానికి ఆధునిక సాంకేతికతను వినియోగించనుంది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈకార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తుంది.

పక్క రాష్ట్రాల్లో ఇదీ పరిస్థితి

ఆంధ్రప్రదేశ్‌లో 1,000-1,500 ఎకరాల వరకు ఒక గ్రామ వ్యవసాయ సహాయకుడిని అక్కడి ప్రభుత్వం నియమించింది. గ్రామస్థాయిలో వివిధ వ్యవసాయ సర్వేలు, ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారులైన రైతులను గుర్తించటం, ధ్రువపత్రాల సేకరణ, రైతు సమావేశాల నిర్వహణ వంటి విధులు నిర్వర్తించటంతో వ్యవసాయ విస్తరణ సేవలు అన్నదాతలకు మరింత చేరువయ్యాయి. మహారాష్ట్ర, ఒడిశాలో టెండర్ ప్రక్రియ ద్వారా ప్రైవేటు కంపెనీలకు డిజిటల్ పంట సర్వే బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకలో ఒప్పంద ప్రాతిపదికన సిబ్బందిని నియమించి సర్వే చేయిస్తున్నారు. తమిళనాడులో వ్యవసాయ విద్యనభ్యసించిన వారిని రోజూవారీ వేతనంతో పనిచేయించుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వ్యవసాయ సహాయకులను నియమిస్తే సర్వే చేయటానికి సిద్ధమని ఏఈఓల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌గౌడ్, సురేష్‌రెడ్డి చెబుతున్నారు.

సిబ్బంది కొరతే సమస్య


ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 196 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈఓలు) పనిచేస్తున్నారు. వీరి పరిధిలో సుమారు 11.56 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ప్రతి 5వేల ఎకరాలకు ఒకరి చొప్పున 232 మంది ఏఈఓలు అవసరం. ఉభయ జిల్లాల్లో దాదాపు 50 శాతం క్లస్టర్లలో సాగు భూమి 5వేల ఎకరాలకు మించి ఉంది. ఇల్లెందు మండలం కొమురారం క్లస్టర్‌లో ఒక్క ఏఈఓ పరిధిలో సుమారు 29వేల ఎకరాల సాగు భూమి ఉండటం గమనార్హం. డిజిటల్ సర్వేలో భాగంగా సదరు ఏఈఓలు తమ పరిధిలోని అన్ని పంట పొలాల్లోని సర్వే నంబర్లలోకి వెళ్లి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది.

# వేదన మిగిల్చిన నైరుతి

ఖమ్మం : ఈ ఏడాది ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వాసులకు నైరుతి రుతుపవనాలు వేదన మిగిల్చాయి. వీటి ప్రభావంతో జూన్ రెండో వారం నుంచి ఇప్పటివరకు కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. ఆగస్టు రెండో వారం వరకు మోస్తారు వర్షపాతం నమోదైనా.. ఆతర్వాత తుపాను ప్రభావంతో కుండపోత వానల వల్ల ఉభయ జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించగా.. అదేనెల 15 నుంచి పూర్తిస్థాయిలో విస్తరించాయి. ఈనెలాఖరున నిష్క్రమిస్తాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఈసారి కురిసిన వర్షాలకు జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. ఉభయ జిల్లాల్లో పదుల సంఖ్యలో కాలనీలు జలమయమయ్యాయి. రహదారులు, కల్వర్టులు, వంతెనలు దెబ్బతినగా.. వేలాది ఎకరాల్లోని పంట పొలాల్లో ఇసుక మేటలు వేసి అన్నదాతలకు కడగండ్లు మిగిల్చాయి.

ఘొల్లుమన్న ఖమ్మం

నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు నమోదయ్యాయి. జిల్లాలో వానాకాలంలో సాధారణ వర్షపాతం 783.8 మిల్లీమీటర్లు కాగా.. 1,128.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. తిరుమలాయపాలెం, కల్లూరు, వేంసూరు, మధిర ప్రాంతాల్లో 60శాతానికి పైగా అధికంగా వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా ఏన్కూర్ మినహా మిగతా మండలాల్లో మిగులు వర్షపాతం నమోదైంది. ప్రధానంగా ఈనెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు ఆకేరు, మున్నేరు నదులు పొంగటంతో అనేక ప్రాంతాల్లో సాధారణ ప్రజలు, అన్నదాతలతో పాటు ప్రభుత్వ ఆస్తులకు తీరని నష్టం వాటిల్లింది. ప్రాణనష్టమూ సంభవించింది.



మునిగిన మణుగూరు.. తెగిన పెద్దవాగు

ఖమ్మం జిల్లాతో పోల్చితే నైరుతి రుతుపవనాల ప్రభావం భద్రాద్రి జిల్లాలో తక్కువైనప్పటికీ కొన్నిచోట్ల కురిసిన భారీ వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జులైలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడటంతో గుమ్మడివల్లి, తుపాను ప్రభావం వల్ల మణుగూరు, బుగ్గవాగు పొంగటంతో ఇల్లెందులోని కొన్ని కాలనీల్లోకి వరదనీరు చేరి ప్రజలు నిరాశ్రయులయ్యారు. భద్రాద్రి జిల్లాలో ఈ ఏడాది సాధారణ వర్షపాతం 947 మిల్లిమీటర్లు కాగా.. 1,240.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. ప్రధానంగా మణుగూరు, ఆళ్లపల్లిలో సాధారణం కంటే 60 శాతానికి పైగా వర్షం కురిసింది. 23 మండలాల్లో పదకొండు మండలాల్లో సాధారణ, 10 మండలాల్లో మిగులు వర్షపాతం నమోదైంది.

# పనులు వేగవంతం.. రాకపోకలు సులభతరం

తాండూరు :రహదారులు, వంతెనల నిర్మాణాలు సకాలంలో పూర్తయితే రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అధికారుల తాత్సారం, గుత్తేదారు నిర్లక్ష్యం తదితర కారణాలతో పనులు కొలిక్కి రాకపోతే వర్షాకాలంలో ప్రజల రాకపోకలు నిలిచి అవస్థలు పడాల్సి వస్తుంది. తాండూరు- సంగారెడ్డి మార్గంలో ఏళ్ల తరబడి ఇలాంటి పరిస్థితే నెలకొంది. సమస్యను స్థానికులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రత్యేక చొరవ చూపి రోడ్డు నిర్మాణ పనులకు మార్గం సుగమం చేశారు.

మట్టిపోసినా కుంగిపోయింది

తాండూరు నుంచి సంగారెడ్డి వెళ్లే మార్గంలో గాజీపూరు, బుద్దారం వాగులపై వంతెనల నిర్మాణానికి 2016లో ప్రభుత్వం రూ.9 లక్షల నిధులను మంజూరు చేసింది. అప్పటి నుంచి నిర్మాణ పనులు సాగుతున్నాయి. బుద్దారం వాగుపై వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. గాజీపూరు వాగుపై వంతెన పనులు మాత్రం ఒక అడుగు ముందుకు పడితే నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లు సాగుతున్నాయి. వంతెన నిర్మాణ సమయంలో గుత్తేదారు చేతులు ఎత్తేశారు. మరో గుత్తేదారుకు అప్పగించారు. ఏడాది క్రితం వంతెన పనులు పూర్తి చేశారు. తాత్కాలికంగా మట్టిని పోసి రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకున్నారు. వర్షాలకు మట్టి దిగబడి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. శిథిలమైన పాత వంతెన పైనుంచి ప్రయాణాలు సాగాయి. భారీ వర్షాలకు ఆ వంతెన పైనుంచి



సైతం రాకపోకలు నిలిపివేశారు.

అత్యవసర సమయంలో పడరాని పాట్లు

భూ సమస్య వల్ల వంతెన నిర్మాణ పనులు చాలా కాలం కొనసాగలేదు. దీంతో వానా కాలంలో వాగులు పొంగితే చాలు ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, ప్రమాదాలకు గురైన వారు సకాలంలో ఆసుపత్రులకు చేరలేకపోయారు. వాగుల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. తాండూరు నుంచి వివిధ ప్రాంతాలు రవాణా చేసే సిమెంటు, నాపరాయి లారీలు రోజుల తరబడి ఆగిపోయేవి. జాతీయ రహదారి 65కు ఈ మార్గం అనుసంధానం కావడంతో సరకు రవాణా చేసే వాహనాలు, వ్యాపారులు కూడా అవస్థలు పడేవారు. ప్రస్తుతం గాజీపూరు వంతెన అనుసంధాన పనులు వేగంగా సాగుతున్నాయి. ఎత్తుగా ఉన్న వంతెనకు సమాంతరంగా మట్టిని పోసి చదును చేస్తున్నారు. సుమారు వంద మీటర్ల దూరం నుంచి మట్టితో కలుపు రోడ్డును వెడల్పు చేస్తున్నారు. ఎప్పటికప్పును యంత్రాలతో తొక్కిస్తూ మట్టిని గట్టిపరుస్తున్నారు. కింది నుంచి వెళ్లే మార్గాన్ని పూర్తి తొలగించారు. మట్టి గట్టి పడగానే కంకర పనులు చేయనున్నారు. తారు వేసి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తారు.

## ఆకాశ మార్గం..సుగమం

తాండూరు :రాజధాని నుంచి రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు వెళ్లేందుకు కీలకమైన రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం విషయంలో రక్షణ శాఖతో ఏర్పడిన ప్రతిష్టంభనకు పరిష్కారం దొరికొంది. వీటి నిర్మాణం కోసం తమ ఆధీనంలో ఉన్న 170 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు రక్షణ శాఖ ఉన్నతాధికారులు అంగీకరించారు. దీనికి బదులుగా మరోచోట రక్షణ శాఖకు 400 ఎకరాలను ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది.

శామీర్‌పేట ఫైరింగ్ రేంజ్‌లో..

జేబీఎస్ నుంచి తూంకుంట వరకు దాదాపు 20 కిలోమీటర్ల మేర రాజీవ్ రహదారిలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టింది. నాగ్‌పూర్ జాతీయ రహదారిలో ప్యారడైజ్ నుంచి కొంపల్లి వరకు పది కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. రెండు వంతెనలను నిర్మించాలంటే రక్షణ శాఖ 170 ఎకరాలను ఇస్తేనేగానీ ఈ ప్రాజెక్టు ముందుకు వెళ్లని పరిస్థితి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సమస్య గురించి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో చర్చించారు. వీటికి స్థలాలను



ఇచ్చేందుకు కేంద్రమంత్రి అంగీకరించారు. బదులుగా మూడింతల స్థలం తమకు నగర పరిధిలోనే ఇవ్వాలని రక్షణ శాఖ కోరింది. ఈనేపథ్యంలో రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ రక్షణ శాఖ అధికారులతో చర్చించారు. శామీర్‌పేట ఫైరింగ్ రేంజ్‌లో 400 ఎకరాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకురావడంతో రక్షణ శాఖ అధికారులు ఆమోదం తెలిపారు.

ఆరెకరాలకు.. పరిహారం..లంగర్‌హౌస్‌లో రోడ్డు వెడల్పు ప్రక్రియ,మెహిదీపట్నంలో స్కైవాక్ పనులు ఆగిపోయాయి. దీనికి రక్షణ శాఖకు చెందిన ఆరెకరాల స్థలం అవసరం. అది ఇస్తే రూ.400 కోట్లు ఇవ్వాలని రక్షణ శాఖ కోరింది. దీనికి సంబంధించి కూడా శామీర్‌పేటలో స్థలాన్ని తీసుకునేందుకు రక్షణ శాఖ అంగీకరించింది. ఎలివేటెడ్ కారిడార్‌పై ఉన్నతాధికారుల సమావేశంరాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ మీదుగా చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ల అంశంపై కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ఉన్నతాధికారులు సమావేశమైనట్లు తెలిసింది. రక్షణ శాఖ ఉన్నతాధికారులు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి హాజరైనట్లు సమాచారం. రక్షణశాఖకు సంబంధించిన భూములను కేటాయించేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఏవోసీ సెంటర్ చౌరస్తాకు అనుసంధానంగా ఉన్న వివిధ రహదారులకు ప్రత్యామ్నాయంగా నిర్మించాలనుకున్న రహదారి ప్రస్తావన వచ్చిందని తెలిసింది.





# సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు సుప్రీం ధర్మాసనం వీడ్కోలు

దిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నవంబర్ 10న పదవీ విరమణ చేయనున్నారు.

ఈ క్రమంలో శుక్రవారం ఆయనకు చివరి పనిదినం కావడంతో సుప్రీం ధర్మాసనం ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేపటి నుంచి సర్వోన్నత న్యాయస్థానం నుంచి తీర్పులు ఇవ్వలేనన్న మాట వాస్తవమని.. అయినప్పటికీ తాను వృత్తిపరంగా పూర్తి సంతృప్తిగా ఉన్నానని చెప్పారు. మరోవైపు సుప్రీం కోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులలైన సంగతి తెలిసిందే. నవంబర్ 11న జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఇదివరకే వెల్లడించారు. 2025 మే 13 వరకు ఆయన సీజేఐగా కొనసాగనున్నారు.



# కాంగ్రెస్ నేతలు షో కోసమే అలా చేస్తుంటారు: మోదీ విమర్శలు

నాసిక్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీని యావత్ దేశం పూర్తిగా తిరస్కరించిందని.. అందుకు ఆ పార్టీ చర్యలే కారణమన్నారు. ఆ పార్టీ ఇప్పుడు ఆల్ ఇండియా కాంగ్రెస్ కాదన్న మోదీ.. పరాన్నజీవి పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. ఊత కర్రల సాయంతోనే మనుగడ సాగిస్తోందని విమర్శించారు. శుక్రవారం నాసిక్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని ప్రసంగించారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బిహార్, ఝార?ండ్.. ఇలా ఏ రాష్ట్రంలో చూసినా కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలపై ఆధారపడే పోటీచేసే పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు ఉన్న చోట కుంభకోణాలేనంటూ విరుచుకుపడ్డారు. ఈ పార్టీలేవీ రాజ్యాంగం, కోర్టులు, ప్రజల మనోభావాలను సైతం పట్టించుకోవన్నారు. కేవలం షో చేయడానికే కాంగ్రెస్ నేతలు రాజ్యాంగం పుస్తకాన్ని జేబుల్లో పెట్టుకొని తిరుగుతుంటారని ఎద్దేవా చేశారు. తన నాయకత్వంలో ఏర్పాటైన ఎన్డీయే ప్రభుత్వ హయాంలో 25 కోట్ల మంది ప్రజలకు పేదరికం నుంచి విముక్తి కల్పించామన్నారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేశామన్న మోదీ.. తద్వారా 'ఒకే దేశం-ఒకే రాజ్యాంగం' స్ఫూర్తి వాస్తవిక రూపం దాల్చిందని తెలిపారు.


# ఏలూరు పోలీసులను అభినందించిన సీఎం చంద్రబాబు

ఏలూరు: దొంగలించిన 251 ద్విచక్రవాహనాలను ఏలూరు పోలీసులు స్వాధీనం చేసుకుని, 25 మంది అనుమానితులను అరెస్టు చేయటం సంతోషకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియడారు. ఈ కేసులను ఛేదించి బాధిత కుటుంబాలకు ఉపశమనం కలిగించడానికి సరికొత్త సాంకేతికతను ఉపయోగించడం హర్షనీయమన్నారు. సత్వర చర్యలతో ప్రజలకు సేవ చేసిన ఏలూరు పోలీసులను చంద్రబాబు అభినందించారు.

నీలి అలివేణి అనే మహిళ తన తలసేమియా బాధిత కుమార్తెను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ఉపయోగించిన స్కూటర్ గతంలో చోరీకి గురైంది. బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని తిరిగి అప్పగిస్తున్నప్పుడు ఆమె భావోద్వేగాలు కదిలించాయని చంద్రబాబు అన్నారు. ఈ మేరకు ఏపీ పోలీసు శాఖ 'ఎక్స్'లో పోస్టు చేసిన వీడియోను చంద్రబాబు రీట్వీట్ చేశారు. రోజువారీ రవాణా,



జీవనోపాధికి వాడే వాహనాలు చోరీకి గురైతే ఆయా కుటుంబాలు తీవ్ర ఆవేదనకు గురవుతాయన్నారు.



# విజయవాడ-శ్రీశైలం సీ ప్లేన్ ట్రయల్ రన్ విజయవంతం

శ్రీశైలం ఆలయం: విజయవాడ-శ్రీశైలం 'సీ ప్లేన్' ట్రయల్ రన్ విజయవంతమైంది. మొదట విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 'సీ ప్లేన్' శ్రీశైలానికి వచ్చింది.

అక్కడి జలాశయం నీటిలో సురక్షితంగా ల్యాండ్ అయింది. అనంతరం శ్రీశైలం టూరిజం బోటింగ్ జట్టీ వద్దకు సీ ప్లేన్ చేరుకుంది. ఎస్డీఆర్ఎఫ్, పోలీసు, టూరిజం, ఎయిర్ ఫోర్స్ అధికారుల సమక్షంలో ట్రయల్ రన్ నిర్వహించారు.

ఈ నెల 9న పున్నమిఘాట్‌లో విజయవాడ నుంచి శ్రీశైలం మధ్య 'సీ ప్లేన్' ప్రయోగానికి శ్రీకారం చుట్టనున్నారు. డీ హవిల్లాండ్ ఎయిర్‌క్రాఫ్ట్ సంస్థ రూపొందించిన 14 సీట్ల సీ ప్లేన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ట్రయల్ రన్ శుక్రవారం విజయవంతమైంది.

# 'సరస్వతీ పవర్' కేసు.. జగన్ పిటిషన్‌పై విచారణ వాయిదా




హైదరాబాద్: హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌లో సరస్వతీ పవర్ కేసుకు సంబంధించి జగన్ పిటిషన్‌పై విచారణ జరిగింది. కౌంటర్ దాఖలు చేయడానికి విజయమ్మ, షర్మిల తరఫు న్యాయవాది సమయం కోరారు. విచారణను ఎన్‌సీఎల్‌టీ డిసెంబర్ 13వ తేదీకి వాయిదా వేసింది. సరస్వతీ పవర్ కంపెనీలో షేర్ల బదిలీపై జగన్ ఎన్‌సీఎల్‌టీలో ఇటీవల పిటిషన్ వేశారు. తనకు తెలియకుండా తల్లి, సోదరి అక్రమంగా షేర్లు బదిలీ చేసుకున్నారని అందులో పేర్కొన్నారు. విజయమ్మ, షర్మిల, జనార్ధన్‌రెడ్డిని ప్రతివాదులుగా చేర్చారు. షేర్ల బదిలీ ఫారాలు, ఇతర డాక్యుమెంట్లు ఏమీ సమర్పించకుండానే తమ పేర్ల మీదకు మార్చుకున్నారని జగన్ చెప్పారు. జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీ పేరిట షేర్లు కొనసాగేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. 51.01 శాతం షేర్లను యథావిధిగా కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకపోతే.. పదవుల్లో ఎందుకు?: షర్మిల

అమరావతి: అసెంబ్లీకి వెళ్లనివారు ఎవరైనా రాజీనామా చేయాల్సిందేనని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. జగన్ అయినా, వైకాపా ఎమ్మెల్యేలైనా రాజీనామా చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదని వైకాపా అధినేత జగన్ ప్రకటించడంపై షర్మిల తీవ్రంగా స్పందించారు.

మచిలీపట్నంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకపోతే పదవుల్లో ఉండటం ఎందుకని ప్రశ్నించారు. తమ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకుంటే అసెంబ్లీకి వెళ్లి ఏం మాట్లాడగలం అని జగన్ మాట్లాడిన విషయం తెలిసిందే. అసెంబ్లీకి వెళ్లకపోయినా.. రాష్ట్ర ప్రభుత్వాన్ని మీడియా సమావేశాల ద్వారా ప్రశ్నిస్తూనే ఉంటామని చెప్పారు. ఈ విషయంలో జగన్ తీరును షర్మిల తీవ్రంగా పరిగణించారు.



# ధర్మగిరి వేద పాఠశాల సమస్యలు పరిష్కరిస్తాం: తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల: తిరుమలలోని ధర్మగిరి వేద పాఠశాలను తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు శుక్రవారం సందర్శించారు. వేద పాఠశాలలో ఆయనకు పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం అక్కడ మాట్లాడారు. తిరుమల ధర్మగిరి వేద పాఠశాల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సనాతన ధర్మం గొప్పదనాన్ని విద్యార్థులంతా చాటి చెప్పాలన్నారు. తిరుమలలోని గోశాలను సైతం ఛైర్మన్ సందర్శించారు. ఏకాంత సేవలో వినియోగించే వెన్నను ఆయన.. శ్రీవారి సేవకులకు అందించారు.

# అసెంబ్లీకి రాని జగన్‌కు రాజకీయ పార్టీ ఎందుకు?: భూమిరెడ్డి



మంగళగిరి: ఎన్నికల్లో ఎలా అక్రమాలు చేయాలో జగన్‌కు తెలిసినట్లు మరెవరికీ తెలియదని తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విమర్శించారు. బ్యాలెట్ పద్ధతిలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు ఆయన ఎందుకు దూరంగా ఉంటున్నారని ప్రశ్నించారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో భూమిరెడ్డి మాట్లాడారు. గౌతమ్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించి ఎందుకు వెనక్కి తగ్గారని నిలదీశారు.

ఎన్నికల్లో పాల్గొనకుండా, అసెంబ్లీకి రాకుండా జగన్‌కు రాజకీయ పార్టీ ఎందుకని మండిపడ్డారు. పులివెందులలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించలేని ఆయనకు జీతమెందుకన్నారు. వెంటనే రాజీనామా చేస్తే.. పులివెందులకు మరో ఎమ్మెల్యే వస్తారని వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి రాకుండా జగన్ పారిపోవడం సిగ్గుచేటని భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి దుయ్యబట్టారు.

# జగన్ అందుకే నీ తల్లి, చెల్లికి ఈ గతి పట్టింది..





అమరావతి: వర్రా రవీంద్ర రెడ్డి అనే సోషల్ మీడియా యాక్టివిస్ట్ అత్యంత అమాయకుడు, అతని కోసం ఎంతమంది లాయర్లనైనా పెడతానని వైసీపీ అధినేత జగన్ అనడం హాస్యాస్పదమన్నారు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య. జగన్ చెల్లి షర్మిలపై నీతిబాహ్యమైన వ్యాఖ్యలు చేసిన వర్రా రవీంద్రారెడ్డిని వెనకేసుకరావడానికి సిగ్గుచేటుగా లేదా జగన్? అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వర్రా రవీంద్రరెడ్డి మంచివాడు అని జగన్ అంటే నేను జగన్ ఇంటిముందు నిలబడి సెల్యూట్ చేస్తా అని ఛాలెంజ్ చేశారు. షర్మిలపై పెట్టిన పోస్టులు అత్యంత అసభ్యకరమైనవి, జుగుప్సాకరమైనవి. షర్మిల చూస్తే కత్తితో నిన్ను పొడవనా? నేను పొడచుకోనా? అని జగన్ పైకి వస్తుందన్నారు.

**మనసెలా ఒప్పింది..** ఇంతటి జుగుప్సాకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని కాపాడడానికి జగన్ కు మనసెలా ఒప్పింది? అని వర్ల రామయ్య ప్రశ్నించారు. మీడియా సమావేశంలో వర్రా రవీంద్రను జగన్ మంచివాడని అనడంతో సిగ్గుకే సిగ్గనిపించి ఉంటుందని కామెంట్స్ చేశారు. జగన్ చెల్లిపై పెట్టిన పోస్టుపై జగన్ కు రక్తం ఉడికి ఉంటుందనుకునేరు.. కానీ అలా జరగలేదన్నారు. ఎవరికో పుట్టిన షర్మిలను జగన్ తన సొంత చెల్లిలా చూసుకున్నాడు అని వర్రా రవీంద్ర రెడ్డి పోస్టు పెడితే జగన్ ఈ విధంగా స్పందించడం చెల్లి పట్ల ఆయనకున్న అభిప్రాయం తెలుస్తోందని వ్యాఖ్యానించారు. జగన్ దుర్మార్గం, దురాలోచనతో ఎదుటివారిని మానసికంగా హింసించి శునకానందం పొందేవారని విమర్శలు గుప్పించారు. ఆ దురాలోచనే జగన్ తల్లిని, చెల్లిని తాకాయన్నారు. అసభ్యకర పోస్టులు పెట్టినవారిని కాపాడడం కోసం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి వార్ రూమ్ జగన్ పెట్టడం దుర్మార్గం అంటూ ఫైర్ అయ్యారు.

**ప్రజాస్వామ్యం గుర్తు రాలేదా..** తల్లిని, చెల్లిని దూషిస్తే ఊరుకునేవారిలో జగన్ ప్రథముడని వర్ల రామయ్య కామెంట్స్ చేశారు. డాక్టర్ సుధాకర్ ను నడి రోడ్డుపై ఈడ్చి, వేధించి ఆ డాక్టర్ మృతికి కారణమైంది వైసీపీ ప్రభుత్వమేనన్నారు. 16 ఏళ్ల దళిత మహిళను ఐదుగురు దుండగులు పోలీసు స్టేషన్ వెనుక గదిలో అత్యాచారం చేసి పోలీసు స్టేషన్ ముందు పడేస్తే అప్పుడు గుర్తుకు రాలేదా జగన్ కు ప్రజాస్వామ్యం? అని నిలదీశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ లను, చివరకు మమ్మల్ని తిట్టారు, కుటుంబాలను నిందించారు అయినా సహించాం..జగన్ తల్లి, చెల్లిల గురించి బూతు పోస్టులు పెట్టిన వర్రా రవీంద్ర రెడ్డిని అరెస్టు చేయాలో? వద్దో జగన్ చెప్పాలని ప్రశ్నించారు.

**మౌనం ఎందుకు..** వైసీపీ హయాంలో ఉగాండాలో ఉన్న కొడుకు.. సోషల్ మీడియాలో కదిరి ఎమ్మెల్యే ఓబుల్ రెడ్డి పనితీరును ప్రశ్నిస్తూ పోస్టు పెడితే 70 ఏళ్ల వయసున్న వాళ్ల నాన్న అయిన వృద్ధుడిని పోలీసులు అరెస్టు చేసి హింసించారన్నారు. జగన్ కుటుంబసభ్యులైన తల్లి, చెల్లిల గురించి పెట్టిన పోస్టులు చూసి ఇతరులకే జుగుప్సకలిగిస్తుంటే.. జగన్ మాత్రం మౌనం వహించడంలో మర్మమేమిటి? అని ప్రశ్నించారు. జగన్ మానసిక స్థితి గురించి ఏమనుకోవాలో.. వైసీపీ నాయకుల విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు.

# గిరిజనుల సమస్యల కోసం పరిష్కార వేదిక: సోమిరెడ్డి

సర్వేపల్లి: నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని 39 వేల మంది గిరిజనుల కోసం పరిష్కార వేదిక ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. గిరిజనుల్లో చాలా మందికి ఆధార్ (%ఘుఖుసష్టుఖుతీ%), రేషన్‌కార్డులు లేవని, సుమారు 90శాతం మంది నిరక్షరాస్యులు ఉన్నారని చెప్పారు. పింఛన్ సమస్యలు కూడా ఉన్నాయని చెప్పిన ఆయన.. వీటన్నింటినీ పరిష్కరించేందుకే ఓ వేదికను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గిరిజనుల దుర్భర జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. "జిల్లా అధికారులంతా గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తున్నారు. గిరిజనుల విషయంలో ఎవరూ నిర్లక్ష్యం వహించకూడదు. 90 శాతం కేంద్ర పథకాలను గిరిజనులకు అందకుండా గత ప్రభుత్వం ఆపేసింది. వాటిని సర్వేపల్లి గిరిజనులకు చేరవేస్తాము. గత ఐదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైన గిరిపుత్రులను ఆదుకుంటాం. ప్రతి అధికారి గిరిజనుల విషయంలో నిర్లక్ష్యం



వహించరాదు. స్థానికులకు లోన్లు మంజూరు చేస్తాం. పాఠశాలలను అభివృద్ధి చేస్తాం" అని సోమిరెడ్డి తెలిపారు.

## మీటూ వేవ్.. ఆమెకు అనసూయ మద్దతు

ప్రముఖ టాలీవుడ్ కొరియోగ్రాఫర్ పై లైంగిక వేధింపుల కేసు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. 21 ఏళ్ల అతడి సహాయకురాలు ఆరోపణలు చేయడంతో నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఆరోపణలపై పలువురు టాలీవుడ్ ప్రముఖులు స్పందించారు. పలువురు సోషల్ మీడియా ద్వారా బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నటి పూనమ్ కౌర్, గాయని చిన్మయి, ఇతర టాలీవుడ్ తారలు బాధితురాలికి మద్దతుగా నిలిచారు. తాజాగా నటి కం యాంకర్ అనసూయ కూడా బాధితురాలికి సంఘీభావం తెలుపుతూ.. జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ వివాదంపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. మహిళలకు సానుభూతి అవసరం లేదు. అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం వారికి ఉండాలి. మీకు లేదా మీకు తెలిసిన వారికి అలాంటి వేధింపులు ఎదురైతే మాట్లాడండి.



మీకు మద్దతు లభిస్తుంది. నేను బాధితురాలితో కలిసి పనిచేశాను. పుష్ప సెట్స్‌లో ఆమెను రెండు మూడు సార్లు చూశాను, చాలా ప్రతిభావంతురాలు. ఈ పరిస్థితి ఆమె సామర్థ్యాన్ని తగ్గించలేదు. అయితే మౌనంగా బాధపడటం వల్ల ప్రయోజనం ఉండదు. నా కార్యాలయంలో ఎవరైనా అలాంటి సవాళ్లను ఎదుర్కొంటే, నేను ఎల్లప్పుడూ స్పందిస్తాను. ఈ కేసులో బాధితురాలికి న్యాయం జరుగుతుందని నేను నమ్ముతున్నాను. ఫిల్మ్ ఛాంబర్ – WIC సభ్యులకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. పరిశ్రమలో ఏ స్త్రీకి మళ్లీ ఇలాంటి పరిస్థితి రాకూడదని ఆశిస్తున్నాను అని అనసూయ రాశారు.

**వెతుకుతున్న పోలీస్:** కొరియోగ్రాఫర్ పై కేసు నమోదు చేసిన నార్సింగి పోలీసులు పరారీలో ఉన్న కొరియోగ్రాఫర్ కోసం గాలింపు ప్రారంభించారని కథనాలొస్తున్నాయి. ఫిర్యాదు అందిన అనంతరం అతడు అందుబాటులో లేరని సమాచారం. అతడి ఆచూకీ తెలుసుకున్న నార్సింగి పోలీసులు నెల్లూరుకు ఒక బృందాన్ని పంపించారని, అతడికి నోటీసులు జారీ చేశారని, త్వరలో అరెస్ట్ జరిగే అవకాశం ఉందని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

## సమంతను ఇకపై అలా చూడబోధట!

టాలీవుడ్‌తో పాటు దేశ వ్యాప్తంగా పాపులారిటీ ఉన్న హీరోయిన్ సమంత. తెలుగు సినిమా హీరోయిన్‌గా పరిచయం అయిన సమంత తక్కువ సమయంలోనే కోలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు దక్కించుకుంది. గత కొంత కాలంగా బాలీవుడ్‌లోనూ సమంత పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ తర్వాత సమంత బాలీవుడ్ కే పరిమితం అయ్యే అవకాశాలు ఉన్నాయని అంతా భావించారు. అయితే ఆ తర్వాత కొన్ని తెలుగు సినిమాలు చేసినా ఇప్పుడు మాత్రం పూర్తిగా హిందీ పరిశ్రమకే పరిమితం అయ్యే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం అందుతోంది. సమంత నటించిన సిటాడెల్ : హనీ బనీ వెబ్ సిరీస్ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీగా ఉంది. రేపటి నుంచి స్ట్రీమింగ్ కాబోతున్న ఈ వెబ్ సిరీస్‌తో సమంత బాలీవుడ్‌లో తన స్థానంను మరింత పదిల పరచుకుంటుందని అంతా నమ్ముతున్నారు. ఇటీవల సిటాడెల్ ప్రమోషన్‌లో భాగంగా సమంతను ఒక నెటిజన్ మీరు గతంలో మాదిరిగా ఎందుకు ఎక్కువ కమర్షియల్ పాత్రలు ఎంపిక చేసుకోవడం లేదు, మీరు ఎందుకు



ఎక్కువగా కమర్షియల్ సినిమాలు చేయడం లేదు అంటూ ప్రశ్నించడం జరిగింది. అందుకు సమంత తాను ఇకపై అలాంటి సినిమాలు చేయను అంటూ తేల్చి చెప్పింది. సమంత ఆ ప్రశ్నకు స్పందిస్తూ... ఇకపై రెగ్యులర్ కమర్షియల్ సినిమాలు, రెగ్యులర్ డాన్స్ ఉండే పాటలు చేయను అని చెప్పింది. నటిగా నాకు సవాల్ విసిరే పాత్రలను ఎంపిక చేసుకోవాలి అనుకుంటున్నాను. ఈ సమయంలో నేను సినిమాలను ఎంపిక చేసుకునే పరిస్థితిలో ఉన్నాను. కనుక మంచి పాత్రలను ఎంపిక చేసుకుంటూ నటిగా నన్ను నేను సంతృప్తి పరచుకునే విధంగా సినిమాలు చేస్తాను అంటూ ప్రకటన చేసింది. అంటే ఇకపై సమంత నుంచి రెగ్యులర్ కమర్షియల్ సినిమాలను ఆశించడం అత్యాశ అవుతుంది. ఇకపై ఆమె నుంచి రెగ్యులర్‌గా లేడీ ఓరియంటెడ్ సినిమాలు వస్తాయేమో అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తెలుగు లో ఒక సినిమాను చేస్తూ ఉన్నప్పటికీ అది రెగ్యులర్ కమర్షియల్ సినిమా కాదని తెలుస్తోంది. తమిళంలోనూ ఇటీవల ఒక సినిమా కోసం చర్చలు జరిగాయి. సిటాడెల్ స్ట్రీమింగ్ కి ముందే మరో వెబ్ సిరీస్ కి సమంత గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. ఆదిత్య రాయ్ కపూర్ ప్రధాన పాత్రలో రక్త్ బ్రహ్మాండ్ అనే వెబ్ సిరీస్ లో నటించేందుకు సమంత కమిట్ అయింది. ఇటీవలే ఆ వెబ్ సిరీస్ అధికారిక ప్రకటన వచ్చింది. వచ్చే ఏడాది ఆ వెబ్ సిరీస్ ప్రేక్షకుల ముందుకు వస్తుందా అనేది చూడాలి. సమంత ఓకే అనాలే కానీ ఊ అంటావా.. వంటి పదుల కొద్దీ ఐటెం సాంగ్స్ ఆమె ముందు ఉంటాయి. కానీ ఆమె మాత్రం ఐటెం సాంగ్స్ కి, ప్రత్యేక పాత్రలకు ఆసక్తి చూపడం లేదు. కనుక ఇక ముందు సమంతను అలా స్పెషల్ గా చూసే అవకాశం లేదు.




## రామా టాకీస్ ర్యాంప్.. 'మట్కా' ఫోక్ సాంగ్ మేకింగ్ చూశారా?




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ "మట్కా" సినిమాతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీ అయ్యారు. ఆయన హీరోగా నటించిన ఈ పీరియడ్ యాక్షన్ చిత్రానికి కరుణ కుమార్ దర్శకత్వం వహించారు. ఇందులో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లుగా నటించారు. రిలీజ్ డేట్ దగ్గర పడటంతో మేకర్స్ జోరుగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓవైపు ఆఫ్ లైన్ ప్రమోషన్స్ చేస్తూనే, మరోవైపు ఒక్కటొక్కటిగా ప్రమోషనల్ కంటెంట్ ను వదులుతూ ఆన్ లైన్ లోనూ సందడి చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'రామా టాకీస్ ర్యాంప్' అనే సాంగ్ ని విడుదల చేసారు. "రామా టాకీస్ రోడ్డు మీద రంగురాళ్లు అమ్మేవాడా.. రాతిలో ఏమున్నది.. నీ చేతిలో ఉన్నదీ పనితనం.." అంటూ సాగిన ఈ ఫోక్ సాంగ్ ఆకట్టుకుంటోంది. హార్మనీ, తబలా లాంటి ఇన్స్ట్రుమెంట్స్ తో మ్యూజిక్ డైరెక్టర్ భవానీ రాకేష్ క్యాచీ ట్యూన్ ను కంపోజ్ చేసినట్లు తెలుస్తోంది. దర్శకుడు కరుణ కుమార్ స్వయంగా ఈ పాటకు సాహిత్యం అందించడం విశేషం. జానపదం శైలిలో అందరూ పాడుకునేలా లిరిక్స్ రాశారు. సింగర్ సాయి దేవ్ హర్ష ఉత్సాహంగా ఈ పాట పాడారు. 'రామా టాకీస్ ర్యాంప్' సాంగ్ ను రెగ్యులర్ లిరికల్ వీడియో మాదిరిగా కాకుండా, 'మట్కా' ప్రపంచాన్ని పరిచయం చేసే విజువల్స్‌తో ఈ మేకింగ్ వీడియోని రిలీజ్ చేసారు.

కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ వేసిన సింపుల్ మాస్ స్టెప్పులు ఆకట్టుకుంటున్నాయి. 1960-80s కాలానికి తగ్గట్టుగా, అప్పటి వైజాగ్ ప్రాంతాన్ని రీక్రియేట్ చేయడానికి వేసిన భారీ సెట్స్ ను ఈ వీడియోలో మనం చూడొచ్చు. ఎర్ర బస్సులు, పాత మోడల్ కార్లు, సినిమా టాకీస్, ఆ రోజుల్లో వినియోగంలో ఉన్న నోట్లు, నాణేలు.. వంటివి వింటేజ్ ఫీల్ ను తీసుకొస్తున్నాయి. ఈ వీడియో మనకు 'మట్కా' ప్రపంచాన్ని పరిచయం చేస్తోంది. వరుణ్ తేజ్ తో పాటుగా మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి, సలోని, నవీన్ చంద్ర, అజయ్ ఘోష్, కన్నడ కిషోర్ వంటి ఇతర ప్రధాన పాత్రధారులను కూడా ఈ మేకింగ్ వీడియోలో చూపించారు. ఇప్పటికే 'మట్కా' మూవీ గ్లింప్స్, టీజర్, ట్రైలర్, సాంగ్స్.. ఆడియన్స్ ను విశేషంగా ఆకట్టుకున్నాయి. లేటెస్టుగా వచ్చిన 'రామా టాకీస్ ర్యాంప్' పాట కూడా ఆద్యంతం అలరించేలా సాగింది. ప్రస్తుతం ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. 1950-80 బ్యాక్ డ్రాప్ లో కొన్ని వాస్తవ సంఘటనల్ని ఆధారం చేసుకుని రూపొందించిన పీరియడ్ యాక్షన్ డ్రామా 'మట్కా'. రతన్ ఖత్రి అనే గ్యాంబ్లర్ స్టోరీని ఆధారంగా చేసుకొని ఈ ఫిక్షనల్ స్టోరీ రెడీ చేసుకున్నట్లు దర్శకుడు ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. బర్మా నుంచి శరణార్థిగా వైజాగ్‌కు వచ్చిన ఓ యువకుడు.. మట్కా కింగ్‌లా ఎలా ఎదిగాడనే కథాంశాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నారు. ఇందులో వాసు అనే పాత్రలో, నాలుగు భిన్నమైన గెటప్స్ లో వరుణ్ తేజ్ కనిపించనున్నారు. "మట్కా" చిత్రాన్ని వైరా ఎంటర్టైన్మెంట్స్, %ూ=ు% ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్స్ పై భారీ బడ్జెట్ తో నిర్మించారు. విజేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం సమకూర్చారు. ఎ.కిషోర్ కుమార్ సినిమాటోగ్రఫీ నిర్వచించారు. నవంబరు 14న ప్రపంచ వ్యాప్తంగా తెలుగు తమిళ మలయాళ కన్నడ హిందీ భాషల్లో ఈ పాన్ ఇండియా సినిమా విడుదల కానుంది.

## పంచెకట్టులో మ్యాడ్ కుర్రాళ్ళు.. గేట్ రెడీ!



తెలుగు సినీ ఇండస్ట్రీలో కంటెంట్ తో మెప్పిస్తే ఎవరైనా హిట్ సాధించవచ్చు అని నేటితరం కొత్త హీరోలు నిరూపిస్తున్నారు. ఎన్టీఆర్ బామ్మర్ది నార్నే నితిన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇటీవలే ఆయన తన మొదటి చిత్రం మ్యాడ్ తో మంచి హిట్ కొట్టాడు. కామెడీ ఎంటర్టైనర్ గా వచ్చిన ఈ మూవీలో నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. మ్యాడ్ చిన్న చిత్రంగా విడుదలై పెద్ద విజయాన్ని సాధించింది. ఊహించని విధంగా బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లు రాబట్టడం విశేషం. ఈ విజయంతో, మేకర్స్ వెంటనే సీక్వెల్ ప్రకటించారు. ఈ సీక్వెల్‌కి మ్యాడ్ స్క్వేర్ అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు, ప్రస్తుతం సినిమా షూటింగ్ జరుపుకుంటోంది. ఎలాంటి గ్యాప్ లేకుండా ప్రమోషన్ డోస్ కూడా పెంచుతున్నారు. శ్రీకర స్టూడియోస్, సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా, ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొల్పింది. తాజాగా మ్యాడ్ స్క్వేర్ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల అయింది. ఈ పోస్టర్‌లో నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ముగ్గురు పంచెకట్టులో కనిపిస్తూ, పూర్తిగా న్యూ లుక్ లో కనిపించారు. మ్యాడ్ సినిమాకి, ఈ సీక్వెల్ లుక్కుకు ఎలాంటి పోలికలు లేకపోవడం గమనార్హం. ఇది ప్రేక్షకులలో మరింత ఆసక్తి రేకెత్తించింది. ఇక సినిమా పై అంచనాలు పెంచుతూ, చిత్ర బృందం సెప్టెంబర్ 20న మ్యాడ్ స్క్వేర్ సినిమా మొదటి పాటను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, మొదటి సినిమాతోపాటు ఈసారి కూడా ఆయన నుండి సూపర్ హిట్ ఆల్బమ్ రాబోతుందని ఆశిస్తున్నారు. మొదటి సినిమా సాధించిన విజయాన్ని మించి ఈ సీక్వెల్ మంచి ఎంటర్టైనర్ గా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. మరి సినిమా ప్రేక్షకులను ఏ రేంజ్ లో అలరిస్తుందో చూడాలి. సినిమా షూటింగ్ ని వీలైనంత త్వరగా ఫినిష్ చేసి త్వరలోనే రిలీజ్ డేట్ పై కూడా మేకర్స్ అఫీషియల్ క్లారిటీ ఇవ్వాలని అనుకుంటున్నారు.

## ఆషు రెడ్డి.. లెగ్స్ అందాలతో స్టన్నింగ్

సోషల్ మీడియా ద్వారా మంచి క్రేజ్ అందుకున్న వారిలో ఆషు రెడ్డి ఒకరు. జూనియర్ సమంత అని క్రేజ్ అందుకున్న ఆమె, తన షార్ట్ వీడియోల ద్వారా ఫేమస్ అయ్యింది. ఆషు రెడ్డి తన అందంతోనే కాదు, బోల్డ్ మరియు వినోదాత్మక ప్రదర్శనతో ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది. రియాలిటీ షో "బిగ్ బాస్" లో పాల్గొన్న తర్వాత ఆమె పాపులారిటీ అమాంతం పెరిగిపోయింది. అప్పటి నుండి ఆమెకు ఉన్న క్రేజ్ క్రమంగా పెరుగుతూ వచ్చింది. తాజాగా, ఆషు రెడ్డి తనకు ఇష్టమైన డ్రెస్ లో తీసుకున్న ఫోటోలను ఇన్ స్టాగ్రామ్‌లో షేర్ చేయగా, అవి సెకన్లలోనే వైరల్ అయ్యాయి. ఈ కొత్త లుక్స్ లో ఆమె స్లిమ్ మరియు స్టైలిష్ గా కనిపిస్తూ, ఫ్యాన్స్ నుండి పాజిటివ్



రెస్పాన్స్ అందుకుంది. ఫ్యాషన్ సెన్స్‌తో అమ్మడు లెగ్స్ అందాలతో ఆకట్టుకుంటోంది. ఫోటోషూట్‌లో ఆమె డ్రెస్ మరియు లుక్స్‌కు మాత్రమే కాకుండా, తన గ్లామర్ షోకు కూడా ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. పొట్టి డ్రెస్సులో ఉన్న ఆమె లుక్స్, సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించాయి. ఫాలోవర్స్ ఆమె లుక్స్ పై ప్రశంసల జల్లు కురిపించారు. ఒక్క ఫోటోతోనే సోషల్ మీడియాలో ట్రెండ్ అవ్వడంతో, ఆమె క్రేజ్ ఏమిటో మరోసారి రుజువు చేసింది. ఆషు రెడ్డి కేవలం సోషల్ మీడియా స్టార్ మాత్రమే కాదు, సిల్వర్ స్క్రీన్ మీద కూడా తన ప్రతిభను నిరూపించుకుంది. "చల్ మోహన రంగా"లో సహాయ నటిగా కనిపించిన ఆమె, "బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్" చిత్రంలో హీరోయిన్ గా నటించి మంచి గుర్తింపు పొందింది. ప్రస్తుతం "ఏ మాస్టర్ పీస్" అనే సూపర్ హీరో మూవీతో పాటు మరికొన్ని ప్రాజెక్ట్స్ కూడా ఆమె చేతిలో ఉన్నాయి. ఆమె ప్రతి సినిమాతో కూడా తన నటనలో కొత్తదనం చూపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. మరి రాబోయే రోజుల్లో అమ్మడు ఎలాంటి అవకాశాలు అందుకుంటుందో చూడాలి.

## ఘాటైన సొగసులతో రొమాంటిక్ హీరోయిన్

టాలీవుడ్ యువతను తన గ్లామర్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకుంటూ, సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో నిలిచే కేతిక శర్మ మరోసారి తన ప్రత్యేకతను చూపించింది. కేవలం గ్లామర్ లుక్‌కే పరిమితం కాకుండా ట్రెడిషనల్ టచ్‌ను జోడిస్తూ తనలోని సొగసును మరింత అందంగా ప్రదర్శించింది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ ఫోటోలు వైరల్‌గా మారాయి. "భయంకరమైన సోల్, ధైర్యవంతమైన హృదయం, మరియు దృఢమైన మనస్సు" అంటూ క్యాప్షన్ జతచేసిన ఈ ఫోటోలు యువతను మరింత ఆకర్షిస్తున్నాయి. కేతిక గ్లామరస్ సారీలో అద్భుతంగా కనిపిస్తుండగా, ఆమె వేసుకున్న బ్రాండెడ్ హ్యాండ్‌మేడ్ ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నెవ్వర్ బిఫోర్ అనేలా ఓ ట్రెడిషనల్ ఘాటైన లుక్‌లో దర్శనం ఇచ్చిన కేతిక, ఆ ఫోటోషూట్ ద్వారా తనలోని కొత్త కోణాన్ని చూపించింది. ఎల్లప్పుడూ గ్లామర్ డోస్‌లో మాత్రమే కాకుండా, ఈసారి తన స్టన్నింగ్



లుక్‌తో అందరి మనసులను దోచుకుంది. ఈ తరహా ఫోటోషూట్ల ద్వారా కేతిక యూత్‌లో మరింత క్రేజ్ సంపాదించుకుంటోంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండటం వల్ల తన అభిమానులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటూ, సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్స్‌ను ప్రదర్శించడం కేతిక ప్రత్యేకత. ఇలాంటి ప్రెజెన్స్‌తో టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు దక్కించుకోవాలని కేతిక ఆశిస్తోంది. ఇక ఆమె కెరీర్ విషయానికి వస్తే ఇటీవల అవకాశాలు తగ్గాయి. 2021లో రొమాంటిక్ సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయమైన అమ్మడు ఆ తరువాత లక్ష్య -రంగ రంగ వైభవంగా సినిమాల్లో హీరోయిన్ గా అవకాశాలు అందుకుంది. కానీ ఏ సినిమా కూడా అమ్మడికి సరైన సక్సెస్ ఇవ్వలేదు. ఆ మధ్య బ్రో సినిమాలో నటించినప్పటికీ అదేమీ పెద్దగా క్లిక్ కాలేదు. ప్రస్తుతం సోషల్ మీడియాలో మాత్రం తన గ్లామర్ తోనే ఫాలోవర్స్ ను పెంచుకుంటోంది. అలాగే వెబ్ సీరీస్ లలో కూడా నటించేందుకు ఆమె ఆసక్తి చూపుతోంది. మరి ఈ గ్లామర్ షో ద్వారా కేతిక ఏమైనా కొత్త అవకాశాలు అందుకుంటుందో లేదో చూడాలి.



# యాదాద్రి ఇకపై యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట: ఇకపై అన్ని రికార్డుల్లో యాదాద్రి బదులు యాదగిరిగుట్టగా వ్యవహారంలోకి తీసుకురావాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. యాదాద్రి జిల్లా పర్యటనలో భాగంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో సీఎం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. టెంపుల్ బోర్డు ఏర్పాటు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు. యాదగిరిగుట్ట బోర్డుకు తితిదే స్థాయిలో ప్రాధాన్యత ఉండేలా అధ్యయనం చేసి టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. గోశాలలో గోసంరక్షణకు ప్రత్యేక పాలసీ తీసుకురావాలని అధికారులకు సూచించారు. గోసంరక్షణకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. కొండపై నిద్ర చేసి మొక్కులు తీర్చుకునేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. విమాన గోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల నాటికి బంగారు తాపడం పనులు పూర్తి చేయాలన్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను పూర్తి చేయాలని చెప్పారు. అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఆలయానికి సంబంధించి పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాల్సిందేనని అధికారులకు తేల్చి చెప్పారు. మరో వారం రోజుల్లో పూర్తి వివరాలు, ప్రతిపాదనలతో రావాలని ఆదేశించారు. పెండింగ్ పనులు, ఇతర అంశాలపై పూర్తిస్థాయి నివేదిక అందించాలన్నారు.




# మూసీ ప్రవాహాన్ని పరిశీలించిన సీఎం రేవంత్

## రేవంత్ మూసీ పునరుజ్జీవ పాదయాత్రలో భారీగా కాంగ్రెస్ శ్రేణులు

సంగెం: మూసీ పునరుజ్జీవన పాదయాత్రను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. సంగెంలోని మూసీనది ఒడ్డున ఉన్న శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి యాత్రను మొదలుపెట్టారు. యాదాద్రి జిల్లా వలిగొండ మండలం సంగెం నుంచి భీమలింగం వరకు సుమారు 2.5 కి.మీ మేర పాదయాత్ర కొనసాగనుంది. మూసీ పునరుజ్జీవ యాత్రలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి , పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు సీఎం వెంట ఉన్నారు.

# ఎమ్మెల్యేలపై అనర్హత కేసు.. హైకోర్టులో విచారణ



హైదరాబాద్: తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించిన కేసులో హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్‌పై సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. భారాస తరఫున సీనియర్ న్యాయవాది మోహన్‌రావు వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి తీర్పుపై అప్పీల్ చేసే అర్హత అసెంబ్లీ కార్యదర్శికి లేదన్నారు. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్‌కు విచారణ అర్హత లేదన్నారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ సకాలంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ మేరకు పలు కోర్టుల తీర్పులను మోహన్‌రావు చదివి వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను 11వ తేదీకి వాయిదా వేసింది.



# అందుకే కేటీఆర్‌ను అరెస్ట్ చేయడం లేదు

హైదరాబాద్: జన్వాడ ఫాంహౌస్ కేసులో కాంగ్రెస్, భారాస కుమ్మక్కయ్యాయని భాజపా నేత, కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. మూసీ నది పక్కన ఇళ్లు కూల్చేసిన ప్రాంతంలో సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేయాలని.. నల్గొండలో కాదని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో బండి సంజయ్ మాట్లాడారు. "ఆరు గ్యారంటీలపై సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేయాలి. ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు కాకుండా.. ఎన్నికలు వచ్చినప్పుడు బయటకు వస్తే లీడర్ అవుతారా?రేవంత్, బండి సంజయ్ ఒక్కటేనని కేటీఆర్ పదే పదే చెబుతున్నారు. భారాసకు వ్యతిరేకంగా రేవంత్, నేను కొట్లాడామని.. అందుకే తామిద్దరం కేటీఆర్‌కు కలలోకి వస్తున్నాం. డైవర్షన్, కాంప్రమైజ్ పాలిటిక్స్ చేసే అలవాటు కేటీఆర్‌కే ఉంది. భాజపాకు స్పేస్ లేకుండా చేయాలనే కాంగ్రెస్, భారాస కుట్రలు చేస్తున్నాయి. ప్రజా నిర్ణయం ప్రకారం ప్రభుత్వం ఉండాలని కోరుకుంటున్నా. భారాస అధ్యక్షుడు కేసీఆర్ విశ్రాంతి తీసుకుంటుంటే ఆయన కుమారుడు కేటీఆర్ యాక్టింగ్ చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆ పార్టీకి అభ్యర్థులు దొరకడం లేదు. ప్రధానిని కూడా కేటీఆర్ ఏక వచనంతో విమర్శిస్తున్నారు. ఇష్టారీతిన మాట్లాడితే సహించేది లేదు. రేవంత్, బండి సంజయ్ ఒక్కటేనంటూ సోషల్ మీడియాలో భారాస ప్రచారం చేస్తోంది. నేను, రేవంత్ ఒక్కటే అని చెప్పడానికి ఒక్క ఉదాహరణ చెప్పండి. కన్న బిడ్డ పెళ్లికి కూడా వెళ్లకుండా రేవంత్‌ను ఇబ్బంది పెట్టారు. జైలుకు పంపించిన విషయాన్ని ఆయన మరిచిపోయారా?అలాంటి వారితో కాంప్రమైజ్ అవుతున్నారా?ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు కేసులపై హంగామా చేశారు. రేవంత్, కేటీఆర్ మధ్య ఒప్పందం ఉంది. అందుకే కేటీఆర్‌ను అరెస్ట్ చేయడం లేదు" అని బండి సంజయ్ ఆరోపించారు.

## తెలంగాణ పదో తరగతి పరీక్ష రుసుము చెల్లింపు తేదీలు ఖరారు



హైదరాబాద్: పదో తరగతి పరీక్ష రుసుం చెల్లింపు తేదీలను తెలంగాణ ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు వెల్లడించారు. ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా ఈ నెల 18 వరకు చెల్లించుకునేందుకు గడువు ఇచ్చారు. ఆ తర్వాత రూ.50 ఆలస్య రుసుంతో డిసెంబర్ 2 వరకు చెల్లించేందుకు అవకాశం కల్పించారు.

రూ. 200 ఆలస్య రుసుంతో డిసెంబర్ 12 వరకు, రూ. 500 ఆలస్య రుసుంతో డిసెంబర్ 21 వరకు చెల్లించుకోవచ్చని సంచాలకులు ప్రకటనలో పేర్కొన్నారు.



# తెలంగాణ టెట్ దరఖాస్తులు షురూ

## తెలంగాణ టెట్ దరఖాస్తులు మొదలయ్యాయ్.. పూర్తి వివరాలివే..

హైదరాబాద్: తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్షకు దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. అర్హులైన, ఆసక్తి కలిగిన అభ్యర్థులు నవంబర్ 20వరకు ఆన్‌లైన్ https://tgtet2024.aptonline.in/tgtet/ లో దరఖాస్తు చేసుకోవచ్చు. షెడ్యూల్ ప్రకారం.. ఆన్‌లైన్ ఆధారిత టెట్ పరీక్ష జనవరి 1 నుంచి 20తేదీల మధ్య నిర్వహిస్తారు. మొదటి సెషన్ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకుబీ సెకెండ్ సెషన్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరగనున్నాయి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి టెట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు టెట్ 2024-25కు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తు కోసం క్లిక్ చేయండి.

**దరఖాస్తు ఫీజు తగ్గింపు :** గత టెట్ దరఖాస్తు ఫీజు రూ.400 నుంచి రూ.1000కి పెంచడంతో అభ్యర్థుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే. దీంతో ఈసారి అప్లికేషన్ ఫీజును తగ్గించారు. గతంలో ఒక పేపర్‌కు రూ.1000, రెండు పేపర్లకు రూ.2వేలు ఫీజు ఉండగా.. ప్రస్తుతం ఒక పేపర్‌కు ?750, రెండు పేపర్లు రాసిన వారికి రూ.1000కి తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఫీజు పేమెంట్ కోసం క్లిక్ చేయండి. టెట్ పేపర్-1 రాసేందుకు డీఈడీ, పేపర్-2 రాసేందుకు డిగ్రీ, బీఈడీ పూర్తి చేసి ఉండాలి. సర్వీస్ టీచర్లు సైతం టెట్ రాయొచ్చు. ఈ పరీక్షకు విద్యార్హతలు, ఇతర పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లోని బుక్‌లెట్‌లో తెలుసుకోవచ్చు. పేమెంట్ స్టేటస్ తెలుసుకునేందుకు క్లిక్ చేయండి.

**ముఖ్యాంశాలివే..** టెట్‌లో రెండు పేపర్లుంటాయి. పేపర్-1కు డీఈడీ, పేపర్-2కు బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులు. 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రాథమిక పాఠశాలల్లోని సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) ఉద్యోగాలకు అర్హత పొందేందుకు పేపర్-1, ఉన్నత పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) ఉద్యోగాలకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. పేపర్-2లో మళ్లీ గణితం, సైన్స్‌బీ సాంఘికశాస్త్రం రెండు వేర్వేరు పేపర్లు ఉంటాయి. ఒకసారి పాసైతే ఆ స్కోర్‌కు జీవితకాలం గుర్తింపు ఉంటుంది. టెట్‌లో వచ్చిన మార్కులకు డీఎస్సీలో 20% వెయిటేజీ ఇస్తారు. అందుకోసమే మార్కులు పెంచుకునేందుకు అభ్యర్థులు మళ్లీ మళ్లీ పరీక్ష రాస్తుంటారు. టీనేజర్లలో ఈ నైపుణ్యాలుంటే.. తిరుగులేని కెరీర్!

**పూర్తి షెడ్యూల్ ఇదే..** టెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ: నవంబర్ 7 నుంచి 20వరకు. హాల్‌టికెట్ల డౌన్‌లోడ్: డిసెంబర్ 26 నుంచి. పరీక్ష తేదీలు: జనవరి 1 నుంచి 20 మధ్య. ఫలితాలు: ఫిబ్రవరి 5న.



# రేవంత్‌రెడ్డికి ప్రధాని బర్త్‌డే విషెస్

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని పోస్టుకు రేవంత్‌రెడ్డి రిప్లై ఇచ్చారు. మీ విషెస్‌కు ధన్యవాదాలు అని పేర్కొన్నారు. మరోవైపు సీఎం శుక్రవారం యాదాద్రి ఆలయాన్ని దర్శించుకోనున్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి రైతులతో మాట్లాడనున్నారు. రేవంత్‌రెడ్డికి ఏపీ సీఎం చంద్రబాబు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రేవంత్‌రెడ్డి మరెన్నో పుట్టిన రోజు వేడుకలు చేసుకోవాలన్నారు.

# సామాజిక న్యాయం గురించి కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారా?: ఎంపీ లక్ష్మణ్



హైదరాబాద్: తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికి మోడల్ అవుతుందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పడం విడ్డూరంగా ఉందని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు సామాజిక న్యాయం గురించి మాట్లాడటం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఈ మేరకు రాష్ట్ర భాజపా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "రాహుల్ గాంధీ ముందు వారి తాత, ముత్తాతల వైఖరి తెలుసుకోవాలి. చరిత్ర తెలుసుకొని బడుగు బలహీనర్గాలకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి. కాంగ్రెస్ చరిత్ర రేవంత్ రెడ్డికి తెలియదు. కులాల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించవద్దని అప్పట్లోనే రాష్ట్రాలకు నెహ్రూ లేఖలు రాశారు. బీసీల అభ్యున్నతి కోసం అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎటువంటి బీసీ కమిషన్ ఏర్పాటు చేయలేదు. మండల కమిషన్‌ను ఇందిరాగాంధీ పక్కన పెట్టారు. కుల ఆధారిత రిజర్వేషన్ల వల్ల దేశం బాగుపడదని రాజీవ్ గాంధీ వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీల పట్ల ఎనలేని ప్రేమ ఒలక బోస్తున్నారు. అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ.. రిజర్వేషన్లు ఎత్తివేస్తామని చెప్పి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలి" అని లక్ష్మణ్ డిమాండ్ చేశారు.


# హైదరాబాద్‌లో ఇళ్లు కూల్చి.. నల్గొండలో పాదయాత్రా?: హరీశ్‌రావు



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ పాదయాత్ర సందర్భంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో చేస్తున్న అక్రమ అరెస్టులను ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. భారాస కార్యకర్తలను గృహ నిర్బంధం చేస్తే ప్రజల మద్దతు లభించదన్నారు. పాదయాత్ర కాదు.. పాప పరిహార యాత్ర చేసినా కాంగ్రెస్ పాపం పోదని ఎద్దేవా చేశారు. పేదల గూడు కూల్చింది ఒక చోట, పాదయాత్ర మరో చోట అని చెప్పారు. హైదరాబాద్‌లో ఇళ్లు కూల్చి నల్గొండలో పాదయాత్ర చేస్తారా అని ప్రశ్నించారు. హైదరాబాద్ నుంచి పాదయాత్ర మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల మద్దతు ఉంటే నిర్బంధాలు, అక్రమ అరెస్టులు ఎందుకన్నారు. పాదయాత్ర కూడా నిర్బంధాల మధ్య కొనసాగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. భారాస నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూసీ మురికి కూపంగా మారడానికి 50 ఏళ్ల కాంగ్రెస్ పాలన కారణం కాదా? అని హరీశ్‌రావు నిలదీశారు.

## డ్రగ్స్ కేసు.. మహిళకు 13ఏళ్ల జైలు శిక్ష వేసిన రంగారెడ్డి కోర్టు

హైదరాబాద్: డ్రగ్స్ కేసులో ఉగాండాకు చెందిన మహిళకు రంగారెడ్డి జిల్లా కోర్టు 13 ఏళ్లు జైలు శిక్ష విధించింది. 2021లో ఉగాండా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొచ్చిన మహిళను డీఆర్ఐ అధికారులు అరెస్టు చేశారు. మహిళ నుంచి స్వాధీనం చేసుకున్న హెరాయిన్ విలువ దాదాపు రూ. 25.35 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు గుర్తించారు. సుదీర్ఘ వాదనల అనంతరం నిందితురాలికి రంగారెడ్డి జిల్లా కోర్టు 13 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించింది.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com